మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ | పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర | సంపుటి : 08 | సంచిక : 249 | మంగళవారం | 24 - 03 - 2026 | పేజీలు: 8 | వెల: 4

## భగత్ సింగ్ 95వ వర్ధంతి



3లో..



## ఇంధన సరఫరాకు ఊరట

- ☐ హర్మూజ్ జలసంధి దాటిన భారత ఎల్పీజీ నౌకలు
- ☐ రెండు ఎల్పీజీ నౌకలకు ఇరాన్ అనుమతి
- ☐ అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించిన నౌకలు
- ☐ దేశీయంగా గ్యాస్ లభ్యత మెరుగుపడే అవకాశం

మన గళం, న్యూఢిల్లీ : దేశంలో ఇంధన కొరతపై ఆందోళనలు కొనసాగుతున్న వేళ భారత్‌కు చెందిన ఎల్పీజీ, ముడి చమురు నౌకలు హర్మూజ్ జలసంధిని విజయవంతంగా దాటుతుండటం ఊరటనిస్తోంది. తాజాగా రెండు ఎల్పీజీ నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 2 లో..



## ఢిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఏ సోదాలు విస్తరణ

- జమ్ముకశ్మీర్‌లో పలు ప్రాంతాల్లో తనిఖీలు
- ఆయుధాల సరఫరా నెట్‌వర్క్‌పై దర్యాప్తు
- అరెస్టుల సంఖ్య 11కి పెరిగినట్లు ఎన్ఐఏ వెల్లడి

మన గళం డెస్క్ : దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పేలుడు కేసులో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ దర్యాప్తును మరింత విస్తరించింది. ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్ఐఏ అధికారులు 2 లో..

## పశ్చిమాసియా పరిస్థితులపై లోక్‌సభలో ప్రధాని ప్రకటన



- దౌత్యం, చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని వ్యాఖ్య
- సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధమని స్పష్టం
- చమురు, ఎరువుల సరఫరాపై ప్రభుత్వం ముందస్తు చర్యలు

మన గళం, న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులపై లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఈ సంక్షోభాన్ని యుద్ధంతో కాకుండా దౌత్యం, చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో శాంతి స్థాపన 2 లో..

- ☐ ఉత్సవ విగ్రహంలా మారిన ఐక్యరాజ్యసమితి!
- ☐ నిస్సహాయ స్థితిలో అంతర్జాతీయ సంస్థలు
- ☐ ముదురుతున్న యుద్ధ మేఘాలు
- ☐ భారత్ వంటి దేశాలకు దక్కని ప్రాతినిధ్యం

## ప్రపంచ శాంతికి గ్రహణం



మన గళం డెస్క్ : రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచంలో మరో మహా సంగ్రామం రాకూడదని, దేశాల మధ్య తలెత్తే వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలనే ఉన్నత ఆశయంతో ఐక్యరాజ్య సమితి ఏర్పడింది. అయితే ప్రస్తుత 2026 నాటి పరిస్థితులను గమనిస్తే, ఆ ఆశయాలన్నీ అటకెక్కా యనిపిస్తోంది. ఒకవైపు రష్యా-ఉక్రెయిన్ మధ్య ఏళ్ల తరబడి సాగుతున్న యుద్ధం, మరోవైపు అమెరికా-ఇరాన్ మధ్య హార్మూజ్ జలసంధి వేదికగా చెలరేగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచాన్ని మూడవ ప్రపంచ యుద్ధం అంచులకు నెట్టివేస్తున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయాల్లో శాంతిని నెలకొల్పాల్సిన ఐక్యరాజ్యసమితి కేవలం ఖండ నలు, ప్రకటనలకే పరిమితం కావడం విచారకరం. శక్తివంతమైన దేశాలు తమ ప్రయోజనాల కోసం అంతర్జాతీయ నిబంధనలను తుంగలో తొక్కుతున్నా, ఐరాస కేవలం ఒక ప్రేక్షక పాత్రకు మాత్రమే పరిమి తమవ్వడం ఆ సంస్థ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తోంది. భద్రతా మండలిలో చర్చలు కేవలం మాటల యుద్ధాలకే పరిమితమవుతున్నాయి తప్ప, యుద్ధ భూమిలో రక్తం చిందకుండా ఆపే సాహసోపేతమైన నిర్ణయాలు వెలువ డడం లేదు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఉన్న ఐదు శాశ్వత సభ్య దేశాలకు ఉన్న 'వీటో' అధికారం నేడు ప్రపంచ శాంతికి అతిపెద్ద అడ్డంకిగా మారింది. ఏదైనా ఒక దేశం దురాక్రమణకు పాల్పడినప్పుడు దానిని అడ్డుకోవడానికి చేసే తీర్మానాలను, ఆ దేశానికి మద్దతు ఇచ్చే మరో అగ్రరాజ్యం వీటో ద్వారా అడ్డుకుంటోంది. రష్యా-ఉక్రెయిన్ విషయంలో కానీ, ఇప్పుడు ఇరాన్ వ్యవహారంలో కానీ ఇదే పరిస్థితి పునరావృతమవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా వలసవాదం పోయి, 2 లో..

## జగన్‌కు నేరుగా సవాల్




- ☐ వివేకా హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వివాదమని ఆరోపణ
- ☐ విజయమ్మ లేఖపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్
- ☐ దమ్ముంటే జగన్ స్వయంగా మాట్లాడాలని సవాల్

మన గళం, అమరావతి : కుటుంబ ఆస్తుల వివాదం నేపథ్యంలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేస్తూ మీడియా సమావేశంలో ఘాటు వ్యాఖ్యలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఉద్దేశపూర్వకంగా ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. ప్రజల దృష్టిని అసలు అంశం నుంచి మళ్లించడమే లక్ష్యమని ఆరోపించారు. షర్మిల మాట్లాడుతూ, తాను నిజం చెప్పినందుకే తనపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వివేకా హత్య కేసులో తొలుత గుండెపోటు అంటూ ప్రచారం చేయడం వెనుక ఉన్న ఉద్దేశాన్ని 2 లో..

## చంద్రగిరిలో సర్పంచ్‌లకు ఘన సన్మాన సభ

- ఆరు మండలాల నుంచి భారీగా హాజరైన సర్పంచ్‌లు
- ఐదేళ్ల ప్రజాసేవకు గుర్తింపుగా సత్కారం
- అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచిన గ్రామ నేతలు



చంద్రగిరి, మార్చి 23 మన గళం : చంద్రగిరి నియోజకవర్గంలో సర్పంచ్‌లకు అట్టహాసంగా అభినందన సభ నిర్వహించారు. ఆరు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లు హాజరై ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 2తో సర్పంచ్‌ల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి కృషి చేసిన ప్రజాప్రతినిధులను గౌరవిస్తూ ఈ సన్మాన సభ ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ సర్పంచ్‌లు అధికారానికి కాదు, అభివృద్ధికి ప్రతీకలుగా నిలిచారని అన్నారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, కల్యాణ వేదికలు, మహిళా భవనాలు, ధ్యాన మందిరాలు నిర్మించడం ద్వారా గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేశామని తెలిపారు. పంచాయతీలను 2 లో..

## ఎల్పీజీ సంక్షోభానికి ప్రత్యామ్నాయ మార్గాలు

- పీఎన్జీ విస్తరణపై సీఎం దృష్టి
- ప్రతి ఇంటికి పీఎన్జీ కనెక్షన్ లక్ష్యంగా కార్యాచరణ
- ఇండక్షన్, ఎలక్ట్రిక్ వంట పరికరాల వినియోగానికి ప్రోత్సాహం

మన గళం, అమరావతి : రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో నెలకొన్న సమస్యలను అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్ అందించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్పీజీ సరఫరా, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టం, టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై ఆయన క్యాంపు కార్యాలయంలో ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. గ్యాస్ సంక్షోభాన్ని విద్యుత్ రంగానికి ఒక అవకాశంగా మలచాలని సీఎం సూచించారు. 2 లో..



# ఇంధన సరఫరాకు ఊరట

ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అనుమతితో 'జగ్ వసంత్', 'పైన్ గ్యాస్' అనే రెండు నౌకలు సోమవారం ఉదయం హర్మూజ్ జలసంధిని దాటినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ నౌకలు అంతర్జాతీయ జలాల్లో ప్రయాణిస్తూ త్వరలోనే భారత తీర ప్రాంత పోర్టులకు చేరనున్నాయి. ఈ నౌకలు దేశీయ పోర్టులకు చేరుకోవడంతో వంట గ్యాస్ సరఫరా మరింత మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇటీవల పశ్చిమాసి యా ఉద్రిక్తతల కారణంగా భారత్‌కు చెందిన అనేక నౌకలు హర్మూజ్ వద్దే నిలిచిపోయాయి. దీంతో ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం ఇరాన్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరిపింది. భారత నౌకలు సురక్షితంగా ప్రయాణించేందుకు దౌత్యపరంగా చర్యలు తీసుకోవడంతో, ప్రస్తుతం నౌకలు ఒక్కొక్కటిగా దేశానికి చేరుతున్నాయి. ఇది దేశీయ ఇంధన భద్రతకు కీలకంగా మారింది. అయితే ఇరాన్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, చమురు క్షేత్రాలపై జరిగిన దాడులు వంటి కారణాలతో నౌకల ప్రయాణానికి అనుమతుల్లో ఆలస్యాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. అయినప్పటికీ పరిస్థితి క్రమంగా సాధారణ స్థితికి వస్తోందని అధికారులు పేర్కొన్నారు.

# పశ్చిమాసియా పరిస్థితులపై లోక్‌సభలో ప్రధాని ప్రకటన

కోసం భారత్ నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నదని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, వాటి ప్రభావం దీర్ఘకాలం కొనసాగవచ్చని హెచ్చరించారు. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దళాల దాడులు, హోర్ముజ్ జలసంధి మూసివేతతో అంతర్జాతీయంగా చమురు సరఫరాపై ప్రభావం పడుతున్న నేపథ్యంలో, భారత్ పరిస్థితిని సమగ్రంగా పర్యవేక్షిస్తున్నదని ప్రధాని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను కొందరు దుర్వినియోగం చేసుకునే అవకాశం ఉన్నందున దేశంలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. దేశం మొత్తం ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు భారత్ ముందుగానే సిద్ధమైందని ప్రధాని తెలిపారు. గత దశాబ్దంలో ముడి చమురు నిల్వల సామర్థ్యాన్ని పెంచినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ వద్ద సుమారు 53 లక్షల మెట్రిక్ టన్నుల వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. ఇవి ఆయిల్ కంపెనీల నిల్వలకు భిన్నమని తెలిపారు. అలాగే రిఫైనరీ సామర్థ్యాన్ని కూడా గత 11 సంవత్సరాల్లో పెంచుకున్నామని చెప్పారు. వ్యవసాయ రంగంపై కూడా ఈ సంక్షోభ ప్రభావం పడే అవకాశం ఉందని, అయితే రైతులకు అవసరమైన ఎరువులను సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధాని స్పష్టం చేశారు. కోవిడ్ సమయంలో లాగా రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులకు అన్ని విధాలుగా మద్దతు అందిస్తామని హామీ ఇచ్చారు.

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు మొదలైన తర్వాత ఇప్పటివరకు 3.75 లక్షల మంది భారతీయులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్లు ప్రధాని తెలిపారు. కేవలం ఇరాన్ నుంచే 1000 మందిని రక్షించామని, వారిలో 700 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. ఈ సంక్షోభ ప్రభావాన్ని తగ్గించేందుకు స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక వ్యూహాలను అమలు చేస్తున్నామని తెలిపారు. పశ్చిమాసియా సంక్షోభంపై భారత పార్లమెంట్ ఒకే స్వరం వినిపించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. యుద్ధం జరుగుతున్న దేశాలతో భారత్‌కు ఉన్న వాణిజ్య సంబంధాలు దృష్ట్యా ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇథనాల్ మిశ్రమ విధానం ద్వారా భారత్ ఇంధన దిగుమతులను గణనీయంగా తగ్గించుకున్నదని కూడా వివరించారు.

# ఢిల్లీ పేలుడు కేసులో ఎన్ఐఏ సోదాలు విస్తరణ



సోదాలు నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే తనిఖీలు ప్రారంభించి కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. హంద్వారా ప్రాంతంలో ఓ వ్యాపారి నివాసంలో ఎన్ఐఏ ప్రత్యేకంగా సోదాలు నిర్వహించింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన వ్యక్తులకు ఆయుధాలు సరఫరా చేసిన నెట్‌వర్క్‌తో ఆ వ్యాపారికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సోదాల్లో పలు ముఖ్యమైన పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇదివరకే పుల్వామా, కుల్గాం, శోపియాన్, బారాముల్లా, కుప్వారా జిల్లాల్లో కూడా ఎన్ఐఏ విస్తృత తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అయితే జమ్మూకశ్మీర్‌లో ఇటీవల చోటుచేసుకున్న నిరసనల కారణంగా కొంతకాలం దర్యాప్తు మందగించినట్లు సమాచారం. అయినప్పటికీ ప్రస్తుతం సోదాలను మరింత వేగవంతం చేశారు.

ఢిల్లీ పేలుడు ఘటనలో సూసైడ్ బాంబర్ ఉమర్ నబీకి ఆయుధాలు సరఫరా చేసిన మరో ఇద్దరిని ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. వీరు స్లీపర్ సెల్స్‌గా పనిచేస్తూ ఉగ్ర సంస్థలకు సమాచారం చేరవేస్తున్నట్లు విచారణలో తేలిందని అధికారులు తెలిపారు. ఈ అరెస్టులతో కేసులో కీలక పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ కేసులో అరెస్టైన వారి సంఖ్య 11కి చేరినట్లు ఎన్ఐఏ వెల్లడించింది. ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించి పూర్తి స్థాయి నెట్‌వర్క్‌ను బహిర్గతం చేసే దిశగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. దేశ భద్రత దృష్ట్యా ఈ కేసును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.

# ప్రపంచ శాంతికి గ్రహణం

ప్రజాస్వామ్యం విస్తరించిన నేటి కాలంలో కూడా ఐరాస నిర్మాణం ఇంకా 1945 నాటి పాత పద్ధతుల్లోనే ఉండడం పెద్ద లోపం. భారత్ వంటి ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలు మరియు అత్యధిక జనాభా కలిగిన దేశాలకు భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం లేకపోవడం వల్ల అంతర్జాతీయ నిర్ణయాల్లో సమతుల్యత లోపిస్తోంది. కేవలం కొన్ని దేశాల గుత్తాధిపత్యం నడుస్తుండడం వల్ల మిగిలిన ప్రపంచ దేశాల గొంతు ఐరాస వేదికపై వినిపించడం లేదు. ఆఫ్రికా, లాటిన్ అమెరికా మరియు ఆసియా ఖండాలలోని మెజారిటీ దేశాల సమస్యల కంటే, అగ్రరాజ్యాల వ్యూహాత్మక ప్రయోజనాలకే ఈ సంస్థ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. యుద్ధాల వల్ల కేవలం సైనికులు మాత్రమే కాకుండా, లక్షలాది మంది సామాన్య ప్రజలు, మహిళలు, చిన్నారులు బలైపోతున్నారు. ఆహార భద్రత దెబ్బతిని ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసు విచ్ఛిన్నమవుతోంది మరియు చమురు ధరల పెరుగుదల వల్ల సామాన్యుడి బతుకు భారమవుతోంది. ఇంత జరుగుతున్నా, యుద్ధం చేస్తున్న దేశాలపై కఠినమైన ఆంక్షలు విధించడంలో లేదా వారిని చర్చల టేబుల్ వద్దకు తీసుకురావడంలో ఐరాస దౌత్యం విఫలమవుతోంది. ఐరాసకు సొంతంగా శాంతి పరిరక్షక దళాలు ఉన్నప్పటికీ, అవి కేవలం రక్షణ చర్యలకే తప్ప యుద్ధాన్ని ఆపే స్థాయిలో లేవు. దీనివల్ల బలమున్న దేశం బలహీనమైన దేశంపై దాడి చేయడం అనేది ఒక సాధారణ అంశంగా మారిపోయింది, ఇది అంతర్జాతీయ అరాచకత్వానికి దారితీస్తోంది. బాంబుల వర్షంలో చిక్కుకున్న పౌరులకు రక్షణ కల్పించడంలో గానీ, వారికి అవసరమైన మానవతా సాయాన్ని అందించడంలో గానీ అంతర్జాతీయ సంస్థలు ఆశించిన స్థాయిలో స్పందించలేకపోవడం విచారకరం. అంతర్జాతీయ న్యాయస్థానం జారీ చేసే ఆదేశాలను కూడా దేశాలు లెక్కచేయడం లేదంటే, అంతర్జాతీయ చట్టాలకు ఎంతటి దుస్థితి పట్టిందో అర్థం చేసుకోవచ్చు.



ప్రపంచ ఆర్థిక వ్యవస్థ నేడు పెనవేసుకుపోయి ఉంది, కాబట్టి ఒక చోట జరిగే యుద్ధం ప్రపంచమంతా ప్రభావం చూపుతోంది. అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతల వల్ల హోర్ముజ్ జలసంధి మూతపడితే చమురు ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండవు, ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. ఇలాంటి ఆర్థిక సంక్షోభాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఐరాసపై ఉంది, కానీ అగ్రరాజ్యాల మధ్య ఉన్న పంతాలు వ్యాపార మార్గాలను దెబ్బతీస్తున్నా ఐరాస మౌనంగా ఉంటోంది. ఆయుధాల పోటీని నియంత్రించడంలో కూడా ఐరాస పాత్ర శూన్యంగా మారింది మరియు అణ్వాయుధాల వ్యాప్తిని అరికట్టే ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. శక్తివంతమైన దేశాలు తమ ఆయుధ సంపత్తిని పెంచుకుంటూ పోతుంటే, వాటిని ప్రశ్నించే ధైర్యం ఈ సంస్థకు లేదు. అంతరిక్షంలో ఆయుధాల మోహరింపు నుండి సైబర్ యుద్ధాల వరకు నేడు ముప్పు అనేక రూపాల్లో ఉంది, కానీ ఐరాస యంత్రాంగం పాతకాలపు పద్ధతుల్లోనే పనిచేస్తుండడం వల్ల ఆధునిక కాలపు సవాళ్లను ఎదుర్కోలేకపోతోంది. చివరగా, ఐక్యరాజ్యసమితి కేవలం ఒక భవనంలా లేదా చర్చా వేదికలా మిగిలిపోకూడదంటే తక్షణమే సమూలమైన సంస్కరణలు చేపట్టాలి. వీటో అధికారాన్ని నియంత్రించడం లేదా సభ్య దేశాల సంఖ్యను పెంచడం ద్వారా మరింత ప్రజాస్వామ్యబద్ధంగా మార్చాలి. అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పులను ప్రతి దేశం తప్పనిసరిగా పాటించేలా కఠిన నిబంధనలు తీసుకురావాలి, లేనిపక్షంలో గతంలో 'లీగ్ ఆఫ్ నేషన్స్' ఎలాగైతే రెండవ ప్రపంచ యుద్ధాన్ని ఆపలేక అంతరించిపోయిందో, ఐరాస కూడా అదే బాటలో పయనించే ప్రమాదం ఉంది. ప్రపంచ శాంతి అనేది కేవలం కాగితాల మీద ఉండే నినాదం కాకుండా, చేతల్లో చూపాల్సిన బాధ్యత ఐరాస మరియు ప్రపంచ దేశాల పైన ఉంది. మానవజాతి మనుగడ కోసమైనా అంతర్జాతీయ సంస్థలు తమ నిస్సహాయతను వీడి క్రియాశీలకంగా మారాల్సిన సమయం ఆసన్నమైంది. రాబోయే తరాలకు యుద్ధాలు లేని ప్రపంచాన్ని అందించాలంటే, ఇప్పటికైనా అంతర్జాతీయ సంస్థలు నిద్ర మేల్కొని అగ్రరాజ్యాల ఆధిపత్యాన్ని ప్రశ్నించే స్థాయికి ఎదగాలి.

# ఆస్తుల వివాదంపై షర్మిల తీవ్ర విమర్శలు

వైసీపీ నేతలు ఇప్పటికీ చెప్పలేకపోతున్నారని విమర్శించారు. ఈ విషయంలో అవినాష్ రెడ్డి, సాక్షి సంస్థను నడిపిస్తున్న భారతీ రెడ్డి సమాధానం చెప్పాల్సి ఉందని డిమాండ్ చేశారు. ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేకపోవడంతోనే ఇప్పుడు ఆస్తుల వివాదాన్ని ముందుకు తెచ్చారని ఆరోపించారు. తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వస్తున్న విమర్శలను షర్మిల తీవ్రంగా ఖండించారు. ఆ లేఖలోని ప్రతి అక్షరం నిజమని, రాజశేఖర్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఆస్తులను సమానంగా పంచాలని అందులో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. ఆ లేఖపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. నిజంగానే ఆ సంతకం విజయమ్మది కాదని అనుకుంటే ఆమెనే మీడియా ముందుకు వచ్చి చెప్పాలని ప్రశ్నించారు. దమ్ముంటే జగన్ తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు వెల్లడించాలని సవాల్ విసిరారు. తాను ఆస్తుల కోసం పోరాటం చేయడం లేదని, న్యాయం కోసం మాత్రమే ఈ పోరాటం కొనసాగిస్తున్నానని షర్మిల స్పష్టం చేశారు. ఒకవేళ ఆస్తులే తన లక్ష్యమైతే తెలంగాణలో పార్టీ ఏర్పాటు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే రాజకీయాలు చేసేదాన్నని తెలిపారు. జగన్‌తో కలిసి సంతకం చేసిన ఎంఓయూ పత్రాలను ఇన్నాళ్లు బయటపెట్టలేదని, కానీ తన తల్లిపై కేసు వేయడం వల్లే అవి బయటకు రావాల్సి వచ్చిందని వివరించారు. ఈ వివాదం పూర్తిగా వ్యక్తిగతమని, దీనిపై మాట్లాడాల్సింది జగన్ మాత్రమేనని అన్నారు. జగన్ నేరుగా స్పందించకుండా పార్టీ నేతలు, సోషల్ మీడియా ద్వారా విమర్శలు చేయించడం వెనుక ఆయన బలహీనతే కనిపిస్తోందని షర్మిల విమర్శించారు. ఈ అంశంపై మాట్లాడే ధైర్యం లేక ఇతరులను ముందుకు నెట్టుతున్నారని పేర్కొన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలను పాటిస్తున్నామని చెప్పుకునే వారు నిజానికి వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. అదేవిధంగా రాజకీయ లబ్ధి కోసం ప్రత్యేక హోదా, పోలవరం వంటి కీలక అంశాలను తాకట్టు పెట్టిందీ జగన్ ప్రభుత్వమేనని షర్మిల ఆరోపించారు. తాను మాత్రం ప్రజల కోసం, తన తండ్రి ఆశయాల కోసం రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. సాక్షి పత్రిక నిజాన్ని వక్రీకరిస్తోందని, ప్రజలకు తప్పుడు సమాచారాన్ని అందిస్తోందని విమర్శించారు.

# ఎల్పీజీ సంక్షోభానికి ప్రత్యామ్నాయ మార్గాలు

ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్ల వినియోగాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రోత్సహించాలని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే 2.34 లక్షల పీఎన్జీ కనెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ కేవలం 60 వేల మంది మాత్రమే వినియోగిస్తున్నారని అధికారులు వివరించగా, దీనిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో కనీసం 10 వేల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.

శ్రీకాకుళంకాకినాడ పైప్‌లైన్ పనులు నిలిచిపోవడంపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు కేంద్ర మంత్రికి తక్షణమే లేఖ రాయాలని అధికారులకు సూచిం చారు. ఏపీ సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌కు అవసరమైన ఉత్తర్వులు వెంటనే జారీ చేయాలని ఆదేశించారు. వాణిజ్య రంగంలో సహజ వాయువు వినియోగాన్ని పెంచేందుకు 'నేచురల్ గ్యాస్ పాలసీ'ని వచ్చే కేబినెట్ సమావేశంలో ప్రవేశపెట్టాలని తెలిపారు. అత్యవసర రంగాలకు గ్యాస్ సరఫరాపై కూడా సీఎం దృష్టి సారించారు. విద్యా సంస్థలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీలు, అన్న క్యాంటీన్లు, హోటళ్లకు ప్రాధాన్యత క్రమంలో ఎల్పీజీ సిలిండర్లను సరఫరా చేయాలని సూచించారు. ప్రస్తుతం రోజుకు సగటున 1.80 లక్షల సిలిండర్లు పంపిణీ జరుగుతున్నాయని, మరో 14,444 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు ఉన్నాయని అధికారులు సీఎంకు వివరించారు. అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టంపై పూర్తి స్థాయి నివేదికను ఈ నెల 26లోగా సమర్పించాలని సీఎం ఆదేశించారు. వ్యవసాయ రంగంలో జీఎస్‌డీపీ, ఉత్పాదన పెరిగిన నేపథ్యంలో పంటల నిర్వహణ, పంటల మార్పిడి విధానాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు నష్టం తక్కువయ్యేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాలనలో టెక్నాలజీ వినియోగంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో తిరుమలలో దర్శనాల నిర్వహణ మెరుగుపడిన ఉదాహరణను ప్రస్తావించారు. క్యూలైన్ల నిర్వహణలో మెరుగుదలతో భక్తుల నిరీక్షణ సమయం తగ్గి, అదనంగా 20 శాతం దర్శనాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఇదే తరహాలో ఇతర శాఖలు కూడా ఏఐ వినియోగాన్ని పెంచాలని సూచించారు. ఐఓటీ పరికరాలు, సెన్సార్లు, సీసీటీవీల ద్వారా వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంతో సాగు వ్యయం తగ్గించి, ఉత్పత్తి పెంచే అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో బ్యాండ్‌విడ్త్ పెంచి, డేటాను సమర్థంగా ఉపయోగించి ఉత్తమ ఫలితాలు సాధించాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## చంద్రగిరిలో సర్పంచ్‌లకు ఘన సన్మాన సభ

రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు అభివృద్ధి చేసినట్లు చెవిరెడ్డి పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, కొత్తగా వచ్చిన వారు ప్రారంభోత్సవాలు చేసుకునే స్థాయిలో పనులు చేపట్టామని అన్నారు. సర్పంచ్‌ల సహకారం లేకుండా ఈ అభివృద్ధి సాధ్యమయ్యేది కాదని, వారి సేవలను తరతరాలు గుర్తుంచుకుంటాయని తెలిపారు. సర్పంచ్‌లు రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలను పరిష్కరించారని, గ్రామాల్లో ప్రజలతో ఒక కుటుంబంలా మమేకమై పనిచేశారని పేర్కొన్నారు. పదవీకాలం ముగిసిన తర్వాత కూడా ప్రజాసేవలో కొనసాగాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గ్రామ స్థాయిలో ప్రజల సమస్యలపై పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ వ్యవస్థలో సర్పంచ్ స్థానానికి ప్రత్యేక గౌరవం ఉందన్నారు. గ్రామాల్లో కనిపిస్తున్న అభివృద్ధి సర్పంచ్‌ల కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియపై కూడా ఆయన మాట్లాడారు. ఓటర్ల నమోదు, తొలగింపు వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# గుడికి వెళ్లాలంటే... మైలు అవ్వాల్సిందే

**– కలుషితం అవుతున్న... ఆలయాల పరిసరాలు. – చూసి చూడనట్లు.. పంచాయతీ అధికారులు.**





(ఆలూరు మనగళం): కర్నూలు జిల్లా, ఆలూరు మండలం కేంద్రంలో స్థానిక కోట వీధిలో దేవాలయాలకు ప్రసిద్ధి చెందినది. ఇక్కడ శివాలయం నుండి సుంకలమ్మ గుడి మరియు ఆంజనేయ స్వామి గుడి, వీరభద్ర స్వామి గుడి, చన్నకేశవ స్వామి గుడి, ముస్లిం సోదరులు దైవంగా భావించే మసీద్ మందిరలు కొలవై ఉన్నాయి. అలాంటి ప్రదేశంలో వర్షపు నీరు, లేదా కొళాయి నీళ్లు వదిలినప్పుడు, స్థానిక వాసులు బట్టలు పిండిన నీళ్లు, సామాన్లు కడిగిన నీళ్లు వదలడం వల్ల ఆలయాలకు వెళ్లే భక్తులకు ఇబ్బందిగా మారుతుంది. భక్తులు గుడికి వెళ్లాలంటే మురికి నీరు రహదారిలో నిలిచివుండడం వల్ల మురికి నీటిలోనే గుడికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుడికి వెళ్లి దేవుడు ని మనస్ఫూర్తిగా మొక్కులు తీర్చుకోలేకపోతున్నాము అని వాపోతున్నారు. మహిళలు మైలు అయిన బట్టలు మరియు కుటుంబంలో అందరి బట్టలు పిండిన మురికి నీటిని అరబయట పారేయడంతో వీటికి తోడుగా వర్షపు నీరు, గుడికి వెళ్లే రహదారిలో నిలిచి ఉండడంతో గుడికి వెళ్లాలంటే భక్తులు మైలు అయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ ఉన్న స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు మరియు పంచాయతీ అధికారులు అనుసంధానం అయ్యి ఇక్కడ ఉండే అశుభ్రత గమనించి, మురికి నీటి సమస్యకు పరిష్కారం చూపాలని ఆలయాలకు వచ్చే భక్తులు కోరుతున్నారు.

పంచాయతీ అధికారులు కూడ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంతాలలో నెలలు తరబడి రోజులు గడుస్తున్న పారిశుద్ధ కార్మికులు వచ్చి పారిశుద్ధ పనులు చేయడం లేదని కోట వీధిలో బొగ్గబాయి మరియు కోనేరు బావి పరిసరాలలో నెలలు అవుతున్న కాలవలలో చెత్త చేదారం తీయడం లేదు అని ఎన్నోసార్లు తెలిపిన, ప్రజా ప్రదినిధులు మరియు వ్యాపారస్తుల మన్నలకోసం పాకలాడుతున్న పారిశుద్ధ కార్మికులు. ఆలూరు అభివృద్ధిలో భాగంగా దీనికి సంబంధించిన పంచాయతీ అధికారులు గమనించగలరు అని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే పారిశుద్ధ కార్మికులు కూడా సమయపాలన పాటించి, మీకు మేస్త్రి నిర్ణయించిన ప్రదేశంలో పరిసరాలు పరిశుభ్రతకు తగు చర్యలు తీసుకొని, ప్రజల మన్ననలు మరియు అధికారుల మన్నులను పొందాలని కోరారు. రోజు ఒకే దగ్గరే వ్యాపారస్తుల దుకాణాల దగ్గర, అధికారులు ఉండే ఇళ్ళ ముందు, ప్రజాప్రతినిధులు ఉండే ప్రదేశంలో మాత్రమే కాకుండా అప్పుడప్పుడు ప్రజలు నివసించే పరిసరాలు పట్ల కూడా దయవుంచి పారిశుధ్య చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఒక్కొక్క రోజు, ఒక దగ్గర దినాలను సక్రమంగా హాజరయ్యి గ్రామ స్వచ్ఛతను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# బనగానపల్లె మోడల్ స్కూల్ ( జూనియర్ కాలేజ్ )లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మనగళం బనగానపల్లె : 2026 –27 విద్యా సంవత్సరానికి గాను ఏపీ మోడల్ స్కూల్ (జూనియర్ కాలేజ్ )నందు ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బనగానపల్లి ఏపీ మోడల్ స్కూల్( రవ్వలకొండ ) ప్రిన్సిపల్ సి.హెచ్ రామలక్ష్మీ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మీడియం నందు ఎం.పీ.సీ, బైపిసి, ఎంఈసి,సిఇసి,కోర్సులు అందుబాటులో ఉన్నాయి అన్నారు. ఆసక్తిగల ఓసి,బిసి, ఈ,డబ్ల్యూ,ఎస్ విద్యార్థులు 200 రూపాయలు ఎస్సీ ఎస్టీ విద్యార్థులు 150 రూపాయల ఆన్లైన్ రుసుము చెల్లించి వెబ్ సెట్ నందు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి పాసైన విద్యార్థులు ఏప్రిల్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని విద్యార్థుల పదవ తరగతి మెరిట్ మరియు రిజర్వేషన్లకు లోబడి సీట్ల కేటాయింపు జరుగుతుందని ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

# భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్ ఆశయాలను కొనసాగిస్తాము ఏఐఎస్ఎఫ్

**– భగత్ సింగ్ జయంతి వర్ధంతిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారకంగా నిర్వహించాలి: ఏఐఎస్ఎఫ్**

మన గళం కోడుమూరు: భారతదేశ స్వాతంత్ర సమరయోధులు, విప్లవ యువకిశోరులు భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల 95వ వర్ధంతిని స్థానిక కోడుమూరు పట్టణంలో ఉన్న కెవిఆర్ జూనియర్ కళాశాల నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతదేశ యువ కిశోరాలు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రస్తుత కామర్స్ లెక్చరర్ శేఖర్ మాట్లాడుతూ భగత్ సింగ్,రాజ్ గురు,సుఖ్ దేవ్ ల యొక్క పోరాట స్ఫూర్తితో విద్యార్థి, యువజన సమస్యల పరిష్కారం కొరకు రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు, అతి చిన్న వయసులో వారు దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన రియల్ హీరోలని కొనియాడారు, నాడు స్వేచ్ఛ స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, లౌకికవాద పరిరక్షణ కొరకు అనేకమంది ప్రాణ త్యాగాలు చేసిన వారిలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లని గుర్తు చేసుకున్నారు, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం వారి రాజకీయ స్వలాభం కోసం కులాలకు, మతాలకు మధ్య చిచ్చు పెడుతూ పబ్బం గడుపుతున్నారని అన్నారు, యువత భవిష్యత్ తరాల కోసం







నాడు స్వాతంత్రోద్యమంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయులు చరిత్ర కలిగిన దేశం మనదని అలాంటిది నేడు మన దేశంలోని ప్రభుత్వ సంస్థలను సైతం ప్రైవేట్ పరం చేస్తూ యువత యొక్క శ్రమను కార్పొరేట్ రంగాలకు ఊడిగం చేసేటువంటి కుట్రను బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని అన్నారు, దేశానికి వెన్నెముక లాంటి రైతులను సైతం ఆందోళన బాట పట్టే విధంగా చేసిన ఘన చరిత్ర బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు, బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ యొక్క పోరాట స్ఫూర్తితో విద్యార్థులను, యువకులను చైతన్య పరిచి నిరంకుశ వైఖరితో నడుస్తున్న బిజెపి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జయంతి, వర్ధంతిలను అధికారికంగా జరపాలని అదేవిధంగా భగత్ సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు..ఈ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వారు మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రస్తుత కళాశాల లెక్చరర్లు కామర్స్ శేఖర్ బోటనీ లెక్చరర్ ఉని కుమార్ మరియు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ఏఐటీయూసీ మండల కమిటీ ఎన్నిక



మన గళం కోడుమూరు: కోడుమూరు లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన మండల జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లెనిన్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై సమావేశం అనంతరం కోడుమూరు మండల ఏఐటీయూసీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప తెలిపారు.
మండల అధ్యక్షులుగా గడ్డం నాగరాజు, మండల కార్యదర్శిగా మద్దూర్ చిన్న రాముడు, డిప్యూటీ కార్యదర్శిగా మధు లను ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన వారు కార్మికుల హక్కులు కాపాడెందుకు కృషి చేస్తామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లోకకల్యాణార్థం పంచమఠాలలో పూజాదికాలు



మనగళం శ్రీశైలం : లోక కల్యాణార్థం పంచమఠాలలో ఈ రోజు ( 23.03.2026) ఉదయం విశేషంగా అభిషేకం, పుష్పార్చనలు జరిపించబడ్డాయి. ముందుగా ఘంటామఠంలో ఆ తరువాత వరుసగా భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధర మఠాలలో ఈ పూజాదికాలు జరిపించడం జరిగింది. కాగా ఈ రోజు జరిగిన విశేషపూజాదికాలలో ముందుగా అర్చకస్వాములు లోకకల్యాణ సంకల్పాన్నిపఠించారు. ఈ సంకల్పంలో దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలనీ, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలనీ, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని ఘంటామఠంలోని గణపతికి పూజాదికాలు నిర్వహించబడ్డాయి. తరువాత అన్ని మఠాలలో సంప్రదాయబద్ధంగా అభిషేకాది అర్చనలను నిర్వహించబడ్డాయి.కాగా శ్రీశైల సంస్కృతిలో చాలాకాలం పాటు మఠాలు ప్రధానపాత్ర పోషించాయి. ప్రస్తుత సాధారణశకం 7వ శతాబ్దం నుంచి నిర్మించబడ్డ ఈ మఠాలు, గర్భాలయం, అంతరాలయం, ముఖమండపం లాంటి నిర్మాణాలను కలిగివుండి, చూడటానికి ఆలయాల మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని శతాబ్దాల నుండి కూడా ఈ మఠాలన్నీ క్షేత్ర ప్రశాంతతలోనూ, ఆలయ నిర్వహణలోనూ, ఆధ్యాత్మికపరంగా, భక్తులకు సదుపాయాలను కల్పించడంలోనూ ప్రధాన భూమికను వహించాయి. శ్రీశైలంలో కొన్ని మఠాలు కాలగర్భములో కలిసిపోగా, ప్రస్తుతం ఆలయానికి దగ్గరలో వాయువ్య భాగాన ఘంటామఠం, భీమశంకరమఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధరమఠం అనే మఠాలు పంచమఠాలనే పేర్లతో పిలువబడుతున్నాయి. కాగా శిథిలావస్థలో ఉన్న ఈ మఠాలలో ఘంటామఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠాలను దేవస్థానం పూర్తిగా పునరుద్ధరించింది. ప్రాచీన నిర్మాణశైలికి ఎలాంటి విఘాతం కలుగకుండా ఈ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయబడ్డాయి. అదేవిధంగా భీమశంకర మఠానికి తగు మరమ్మతులు కూడా చేయబడ్డాయి. ఈ మఠాలలోని దేవతామూర్తులకు నిత్యధూపదీప నివేదన కైంకర్యాలు జరిపించడం జరుగుతుంది.

# భగత్ సింగ్ 95వ వర్ధంతి




మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు నందుగల సుందరయ్య భవనంలో సిఐటియు ఆధ్వర్యంలో భగత్ సింగ్ 95వ వర్ధంతిని జరుపుకున్నారు ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి గపూర్మియా జిపి.వీరన్న పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్ సింగ్ 1907 సెప్టెంబర్ 28 జన్మించి 1931 మార్చి 23 ఉరి తీయబడ్డారు వీరు భారత స్వాతంత్ర్య సమరంలో అత్యంత ప్రభావవంతమైన విప్లవకారుడు. కేవలం 23 ఏళ్ల వయసులో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి, లాహోర్ జైలులో ఉరితాడును ముద్దాడిన అమరవీరుడు. “ఇంక్విలాబ్ జిందాబాద్“ నినాదంతో యువతలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించిన గొప్ప దేశభక్తుడు అని కొనియాడారు ఈ కార్యక్రమంలో స్థానిక సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.ం

## హరిహర క్షేత్ర వారి ఆధ్వర్యంలో నాలుగు రహదారులలో నాలుగు స్వాగత ముఖ రాతి మండపములు






మన గళం కోడుమూరు: కోడుమూరు గ్రామంలో పునః నిర్మాణం అవుతున్న “హరి హర“ క్షేత్ర శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానము పునఃనిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో కోడుమూరు గ్రామములోకి ప్రవేశించు నాలుగు రహదారులలో అనగా కర్నూలు నుండి కోడుమూరుకు వచ్చే రహదారిలో మరియు బళ్లారి నుండి కోడుమూరుకు వచ్చే రహదారిలో మరియు ఆదోని,ఎమ్మిగనూరు నుండి కోడుమూరు కి వచ్చే రహదారిలో మరియు డోన్, వెల్దుర్తి నుండి కోడుమూరుకు వచ్చే రహదారులలో మొత్తము కోడుమూరుకి నాలుగు దిక్కులలో ఉండే నాలుగు రహదారులలో వచ్చే భక్తులకు మరియు ప్రజలు అందరికీ

“హరి-హర “క్షేత్ర శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానము అందరికీ సాదర స్వాగతము పలుకుతుంది రాతి స్వాగత మండపముల ద్వారా, మండపములు పూర్తి చేయుటకు దాతల ఆధ్వర్యంలో దాతల సహకారంతో నాలుగు మండపములు ఏర్పాటు చేయుటకు దేవస్థాన కమిటీ సభ్యులు తీర్మానం చేసి కొద్ది రోజుల క్రితం గ్రామపంచాయతీ వారి అనుమతి కొరకు దరఖాస్తు చేసుకోవడం జరిగినది, గ్రామపంచాయతీ వారు దరఖాస్తును పరిశీలించి కోడుమూరు గ్రామ సర్పంచ్ భాగ్య రత్న మరియు జు.ా.=.ణ. మంజుల హరిహర క్షేత్రం వారు పెట్టుకున్న దరఖాస్తుకు అనుమతులు ఇచ్చారు ఈ అనుమతి పత్రాన్ని సోమవారం రోజు ఉదయం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానము ధర్మకర్త మరియు చైర్మన్ ఎద్దుల మహేశ్వర రెడ్డి మరియు కమిటీ సభ్యులకు అందజేశారు ఇంత అద్భుతమైన కార్యక్రమమునకు అనుమతి మంజూరు చేసిన ప్రతి ఒక్కరికి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్త మరియు చైర్మన్ ఎద్దుల మహేశ్వర్ రెడ్డి మరియు దేవస్థాన కమిటీ సభ్యులు అందరూ కలిసి అనుమతి పత్రము అందచేసిన ప్రతి ఒక్కరికి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శాలువలతో సత్కారము చేసి వారికి అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు ఇందులో బాగా వారు మాట్లాడుతూ కోడుమూరు అభివృద్ధి కొరకు గ్రామములో హరి హర క్షేత్ర శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన పునఃనిర్మాణము అత్యంత అద్భుతంగా అభివృద్ధి చేయడం కొరకు అలాగే కోడుమూరు అభివృద్ధి కి చేయు ప్రణాళికలో భాగంగా మనము నాలుగు దిక్కులలో స్వాగత ముఖ మండపములు ఏర్పాటు చేస్తే కోడుమూరు మీదుగా వెళ్లే ప్రతి ఒక్కరికి కూడా కోడుమూరు ఒక యాత్రా స్థలము కాబోతోంది అని అందరికీ తెలిసే అవకాశం కలదు, మరియు కోడుమూరు గ్రామ అభివృద్ధి కూడా స్వాగత మండపాములు సూచనలు చేస్తాయి,అందుకే కోడుమూరు అభివృద్ధి కొరకు ఈ కార్యక్రమును శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ సభ్యులు శ్రీకారం చేయడం జరిగిందన్నారు దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య , గ్రామపంచాయతీ అధికారులు మరియు హరి-హర“ క్షేత్ర శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థాన ధర్మకర్త మరియు చైర్మన్ ఎద్దుల మహేశ్వర్ రెడ్డి మరియు దేవస్థానం కమిటీ సభ్యులు రాజశేఖర్ దామోదర్ వెంకటస్వామి రంగస్వామి విజయ సారథి చిప్పి వీరేష్ గంగాధర ఆచారి కిషోర్ రామకృష్ణ వార్డ్ మెంబర్ రవి మొదలగు వారు పాల్గొన్నారు

## గెలాక్సీ ఎస్ 26పై భారీ తగ్గింపు.. నెలాఖరు వరకే ప్రత్యేక ఆఫర్

హైదరాబాద్, మార్చి 23,మన గళం : ప్రముఖ టెక్నాలజీ సంస్థ శామ్సంగ్ గెలాక్సీ ఎస్ 26 ప్రీమియం స్మార్ట్‌ఫోన్ శామ్సంగ్ గెలాక్సీ ఎస్ 26పై వినియోగదారులకు ఆకట్టుకునే రీతిలో భారీ ధర తగ్గింపును ప్రకటించింది. ఇప్పటికే మార్కెట్లో మంచి డిమాండ్ సంపాదించుకున్న ఈ ఫోన్‌పై అకస్మాత్తుగా ధర తగ్గించడం టెక్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పరిమిత కాలం మాత్రమే అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌తో ప్రీమియం ఫోన్ కొనాలనుకునే వారికి మంచి అవకాశం లభించింది. ఈ స్మార్ట్‌ఫోన్ 12 జీబీ ర్యామ్, 256 జీబీ స్టోరేజ్ వేరియంట్ ప్రారంభ ధర రూ.87,999గా ఉండేది. అయితే తాజా ఆఫర్‌లో భాగంగా కంపెనీ నేరుగా రూ.8,000 తగ్గించడంతో ప్రస్తుతం ఈ ఫోన్ రూ.79,999కే లభిస్తోంది. దీనికి తోడు ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులపై అదనపు రాయితీలు, పాత ఫోన్ ఎక్స్ఛేంజ్ ఆఫర్లు కూడా అందుబాటులో ఉండటంతో మొత్తం ధర మరింత తగ్గే అవకాశం ఉంది. అయితే ఈ ప్రత్యేక తగ్గింపు ఆన్‌లైన్‌లో కాకుండా కేవలం ఆఫ్‌లైన్ స్టోర్లలో కొనుగోలు చేసిన వారికి మాత్రమే వర్తించడం గమనార్హం. ఫీచర్ల విషయానికి వస్తే, గెలాక్సీ ఎస్ 26లో 6.3 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ డైనమిక్ అమోలెడ్ 2ఎక్స్ డిస్‌ప్లే ఉండి 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్‌ను అందిస్తుంది. శక్తివంతమైన ఎక్సినోస్ 2600 ప్రాసెసర్‌తో ఈ ఫోన్ వేగవంతమైన పనితీరును ఇస్తుంది. ఫోటోగ్రఫీ కోసం వెనుక భాగంలో 50 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, 12 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్, 10 మెగాపిక్సెల్ టెలిఫోటో లెన్స్‌లతో ట్రిపుల్ కెమెరా వ్యవస్థను అందించారు.



ముందు కెమెరా కూడా క్లియర్ సెల్ఫీల కోసం అనుకూలంగా ఉంటుంది. 4300 ఎంఏహెచ్ బ్యాటరీతో పాటు 25 వాట్ల ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్ట్ ఉండటంతో రోజంతా నిరంతర వినియోగానికి సరిపడే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ ఆఫర్ మార్చి 21 నుంచి మార్చి 31 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. దీంతో తక్కువ ధరలో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ కొనాలనుకునే వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తానికి, ధర తగ్గింపుతో గెలాక్సీ ఎస్ 26 మరింత ఆకర్షణీయమైన ఎంపికగా మారింది.

## అన్నదాతకు అండగా కూటమి ప్రభుత్వం టీడీపీ మండల నాయకులు...

- రైతుల సంతోషమే మాకు ముఖ్యం...
- ప్రతి రైతు కుటుంబానికి సంవత్సరానికి 20,000.



నందవరం మార్చి 23 మనంగళం న్యూస్ : నందవరం మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు మండలం పరిధిలోని నందవరం మాచాపురం గ్రామంలో రైతన్నా -మీకోసం మరియు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం మూడవ విడత నిధులు రైతుల ఖాతాల్లో కూటం ప్రభుత్వం జమ చేయడానికి పరిష్కరించుకొని ఇంటింటి కార్యక్రమాన్ని సోమవారం మాచాపురం నందవరం గ్రామంలో ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర్రెడ్డి ఆదేశాల మేరకు అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ ఖాసీంవాలి జిల్లా మాజీ జెడ్పిటిసి పుష్పవతమ్మ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతులకు ఆర్థికంగా అండగా నిలవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కలిసి పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయడం జరిగిందన్నారు. రైతు సంక్షేమమే



దేశాభివృద్ధికి బాట వేస్తుందని రైతులు బలంగా ఉంటేనే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. 2025-26 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా 8985 కోట్ల రూపాయలను సుమారు 46 లక్షల రైతులకు మూడు విడతలుగా అందిచడం జరిగిందన్నారు. రైతన్నా మీకోసం ద్వారా కూటమి ప్రభుత్వం పంచ సూత్రాలతో రైతులకు ఉపయోగపడేలా ముందుకెళ్తుందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తూ సంక్షేమాన్ని అందిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు, ,ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, టీడీపీ నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



ముంబై, మార్చి 23 ,మన గళం : దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ట్రేడింగ్‌లో భారీ నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు, ముఖ్యంగా అమెరికా-ఇరాన్ దేశాల మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లలో భయాందోళనలను పెంచాయి. ఈ ప్రభావంతో ఏకంగా 1,836 పాయింట్లు పడిపోగా, 50 కూడా 600 పాయింట్లకు పైగా కోల్పోయి 22,500 స్థాయికి దిగజారింది. ఈ పతనంతో ఇన్వెస్టర్లు లక్షల కోట్ల రూపాయల సంపదను కోల్పోయినట్లు అంచనా. మార్కెట్ పతనానికి ప్రధాన కారణంగా పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణమే కనిపిస్తోంది. హర్మ్యాజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ చేసిన హెచ్చరికలకు అమెరికా గట్టిగా స్పందించడంతో అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఈ పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా ఎగబాకాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 108 డాలర్లకు పైగా చేరడం భారత ఆర్థిక వ్యవస్థపై భారం పెరుగుతుందనే ఆందోళనలకు దారితీసింది. దీనితో మార్కెట్‌లో అస్థిరత పెరిగి, ఇండియా వీఐఎక్స్ సూచీ కూడా గణనీయంగా ఎగిసింది. ఈ ప్రభావం ముఖ్యంగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లపై ఎక్కువగా కనిపించింది. రియల్టీ, మెటల్, నిర్మాణ రంగాలకు చెందిన షేర్లలో భారీగా అమ్మకాలు నమోదయ్యాయి. పెట్టుబడిదారులు భద్రతా దృష్ట్యా షేర్లను విక్రయించడంతో మార్కెట్‌పై మరింత ఒత్తిడి పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడిదారులు తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. అంతర్జాతీయ పరిణామాలు స్థిరపడే వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని, దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ఆతురపడకుండా మార్కెట్ పరిస్థితులను గమనిస్తూ ముందుకు సాగాలని సలహా ఇస్తున్నారు. మొత్తానికి, ప్రపంచ రాజకీయ పరిణామాల ప్రభావం భారత స్టాక్ మార్కెట్లపై ఎంతగానో పడుతున్నట్లు ఈరోజు ట్రేడింగ్ స్పష్టంచేసింది.

## కుప్పకూలిన టమాటా ధరలు



హైదరాబాద్, మార్చి 23 ,మన గళం : ఆంధ్రప్రదేశ్‌లో టమాటా ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయి. గత నెలలో కిలోకు రూ.60 వరకు పలికిన టమాటా ధర ఇప్పుడు కేవలం రూ.3కు పడిపోవడం సంచలనం సృష్టిస్తోంది. ఈ పరిస్థితి వినియోగదారులకు లాభదాయకంగా మారినా, రైతులకు మాత్రం తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ప్రధానంగా మదనపల్లె మార్కెట్‌లో ధరలు పూర్తిగా పడిపోవడంతో యార్డులు వెలవెలబోతున్నాయి. సరైన ధర దక్కక రైతులు పంటను మార్కెట్‌కు తీసుకురావడానికే ఆసక్తి చూపడం లేదు. పెట్టుబడి కూడా తిరిగి రాకపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టమాటా పంటను మార్కెట్‌కు తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోతున్నారు. దీంతో కొంతమంది రైతులు తమ పంటను రోడ్ల పక్కన పారబోస్తుండగా, మరికొందరు కోత కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. ప్రత్యేకంగా చిత్తూరు జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఒకప్పుడు మంచి లాభాలు తెచ్చిన టమాటా పంట ఇప్పుడు రైతులను అప్పుల్లోకి నెట్టేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కనీస మద్దతు ధర (మీస్రా) ప్రకటించాలని, నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే వ్యవసాయ రంగంలో ఈ సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. మొత్తానికి, టమాటా ధరల ఈ భారీ పతనం రైతుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుండగా, వెంటనే పరిష్కారం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

## ఏఐ విప్లవం: మానవ మేధకు సవాలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఒకప్పుడు కేవలం సైన్స్ ఫిక్షన్ సినిమాలకే పరిమితమైన అంశం, కానీ 2026 నాటికి అది మన దైనందిన జీవితంలో ఒక విడదీయలేని భాగంగా మారిపోయింది. స్మార్ట్‌ఫోన్ల నుండి భారీ పరిశ్రమల వరకు, వైద్య రంగం నుండి అంతరిక్ష పరిశోధనల వరకు ఏఐ తన ముద్రను బలంగా వేసింది. అయితే, ఈ సాంకేతిక విప్లవం ఒకవైపు అపారమైన అవకాశాలను కల్పిస్తుంటే, మరోవైపు మానవ మనుగడకు మరియు ఉపాధికి పెను సవాలుగా మారుతోంది. యంత్రాలు మనుషుల కంటే వేగంగా ఆలోచించడం మరియు నిర్ణయాలు తీసుకోవడం వల్ల భవిష్యత్తులో మానవ మేధస్సు తన ప్రాధాన్యతను కోల్పోతుందా అనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. సాంకేతిక పురోగతి అనేది సమాజ శ్రేయస్సు కోసమే అయినప్పటికీ, అది మానవ శ్రమను పూర్తిగా నిర్వీర్యం చేసే స్థాయికి వెళ్లడం విచారకరం. ప్రస్తుతం ఏఐ వల్ల ఎదురవుతున్న అతిపెద్ద సమస్య ఉద్యోగాల కోత మరియు ఉపాధి భద్రత క్షీణించడం. సాఫ్ట్‌వేర్ రంగం నుండి కస్టమర్ సర్వీస్ వరకు, కంటెంట్ రైటింగ్ నుండి గ్రాఫిక్ డిజైనింగ్ వరకు అనేక రంగాల్లో ఏఐ టూల్స్ మనుషుల స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. తక్కువ ఖర్చుతో, విశ్రాంతి లేకుండా, అత్యంత ఖచ్చితత్వంతో పనిచేసే యంత్రాల వైపు కంపెనీలు మొగ్గు చూపుతుండటంతో లక్షలాది మంది యువత తమ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారు. ఇది కేవలం ఐటీ రంగానికే పరిమితం కాకుండా, ఉత్పత్తి మరియు సేవా రంగాల్లోనూ తన ప్రభావాన్ని చూపుతోంది. సాంకేతికత పెరిగేకొద్దీ కొత్త ఉద్యోగాలు వస్తాయని నిపుణులు చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం ఉన్న వేగంతో మనుషులు తమ నైపుణ్యాలను మార్చుకోవడం సాధ్యమేనా అన్నది ఒక పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. మరోవైపు, ఏఐ ద్వారా సృష్టించబడుతున్న తప్పుడు సమాచారం మరియు 'డీప్‌ఫేక్స్' అంతర్జాతీయ భద్రతకు మరియు సామాజిక సామరస్యానికి ముప్పుగా పరిణమించాయి. నిజానికి, అబద్ధానికి మధ్య ఉన్న తేడాను గుర్తించలేనంతగా వీడియోలు, ఆడియోలను ఏఐ సృష్టిస్తోంది. దీనివల్ల సైబర్ నేరాలు పెరగడమే కాకుండా, రాజకీయ అస్థిరత మరియు వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగే సంఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. 2026 లో మనం చూస్తున్న ప్రధాన సమస్య ఏమిటంటే, ఒక వ్యక్తి చెప్పని మాటలను లేదా చేయని పనులను చేసినట్లుగా అత్యంత సహజంగా చూపించడం. ఈ సాంకేతికత దుర్వినియోగం కావడం వల్ల సామాజిక మాధ్యమాల్లో నమ్మకం అనేది కరువైపోతోంది. ఏఐ నైతికత గురించి ఎన్ని చర్చలు జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో వాటి అమలు మాత్రం నామమాత్రంగానే ఉంది. ఏఐ విప్లవం వల్ల కలిగే ప్రయోజనాలు తక్కువేమీ కావు, ముఖ్యంగా ఆరోగ్య రంగంలో ప్రాణాంతక వ్యాధులను ముందుగానే గుర్తించడంలో మరియు క్లిష్టమైన శస్త్రచికిత్సల్లో ఏఐ సహాయం ఎంతో విలువైనది. వైద్యులు వేల కొద్దీ రిపోర్టులను విశ్లేషించడానికి పట్టే సమయాన్ని ఏఐ సెకన్లలోనే పూర్తి చేసి ఖచ్చితమైన ఫలితాలను ఇస్తోంది. విద్యా రంగంలో కూడా ప్రతి విద్యార్థికి తగినట్లుగా వ్యక్తిగతీకరించిన బోధనను అందించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తోంది. అయితే, ఈ పురోగతి అనేది మానవ నియంత్రణలో ఉన్నంతవరకే క్షేమకరమని మేధావులు హెచ్చరిస్తున్నారు. యంత్రాలు తమంతట తాముగా నేర్చుకుంటూ , మానవ ప్రమేయం లేకుండా నిర్ణయాలు తీసుకునే స్థాయికి వెళితే, అది మానవజాతి నియంత్రణను దాటిపోయే ప్రమాదం ఉంది. సృజనాత్మక రంగాల్లో కూడా ఏఐ ప్రవేశం కళాకారులు మరియు రచయితల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. ఒకప్పుడు కవిత్వం, పెయింటింగ్, సంగీతం వంటివి కేవలం మానవ భావోద్వేగాలకు సంబంధించినవిగా భావించేవారు. కానీ ఇప్పుడు ఏఐ అల్గారిథమ్స్ అద్భుతమైన చిత్రాలను గీస్తున్నాయి, శ్రావ్యమైన సంగీతాన్ని కంపోజ్ చేస్తున్నాయి. ఇది కళాత్మక విలువలను తగ్గిస్తుందనే వాదన ఒకవైపు ఉంటే, కళను అందరికీ అందుబాటులోకి తెస్తుందని మరో వర్గం వాదిస్తోంది. ఏది ఏమైనప్పటికీ, మనిషి సృష్టించిన కళలో ఉండే ఆ 'ఆత్మ' యంత్రం సృష్టించిన దానిలో ఉంటుందా అన్నది చర్చనీయాంశం. ఈ పోటీలో నిజమైన కళాకారులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం మెండుగా కనిపిస్తోంది. డేటా ప్రైవసీ లేదా వ్యక్తిగత సమాచార గోప్యత అనేది ఏఐ యుగంలో మచ్చుకైనా కనిపించడం లేదు. మనం చేసే ప్రతి క్లిక్, మనం మాట్లాడే ప్రతి మాట ఏఐ అల్గారిథమ్స్ ద్వారా విశ్లేషించబడుతున్నాయి. మనకు తెలియకుండానే మన ఇష్టాఇష్టాలను కంపెనీలు పసిగట్టి, మనల్ని ప్రభావితం చేసే ప్రకటనలను గుప్పిస్తున్నాయి. ఇది ఒక రకమైన డిజిటల్ బానిసత్వానికి దారితీస్తోంది. మన నిర్ణయాలు మనవి కాకుండా, ఏఐ సూచించినవే మనం తీసుకునేలా పరిస్థితులు మారుతున్నాయి. వ్యక్తిగత స్వేచ్ఛకు మరియు గోప్యతకు భంగం కలిగించే ఈ ధోరణిని అరికట్టకపోతే, భవిష్యత్తులో మనిషి కేవలం ఒక డేటా పాయింట్ గానే మిగిలిపోతాడు. ఏఐ అభివృద్ధిలో పారదర్శకత మరియు బాధ్యతాయుతమైన నియంత్రణలు ఉండాలని అంతర్జాతీయ వేదికలపై డిమాండ్లు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఐరోపా యూనియన్ వంటి సంస్థలు ఏఐ వినియోగంపై కఠినమైన చట్టాలను తీసుకువచ్చాయి. కానీ సాంకేతికత అనేది సరిహద్దులు లేనిది కాబట్టి, ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ఒకే రకమైన నిబంధనలు అమలు చేయాలి. ముఖ్యంగా యుద్ధ తంత్రాల్లో 'కిల్లర్ రోబోట్స్' వంటి స్వయంప్రతిపత్తి కలిగిన ఆయుధాల వినియోగంపై నిషేధం ఉండాలి. యంత్రాలకు ప్రాణాలు తీసే అధికారం ఇవ్వడం అనేది మానవత్వానికే విఘాతం. ఈ విషయంలో ప్రభుత్వాలు మరియు కార్పొరేట్ దిగ్గజాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఆర్థికంగా చూస్తే ఏఐ విప్లవం వల్ల సంపద కేవలం కొన్ని టెక్ కంపెనీల చేతుల్లోనే కేంద్రీకృతమవుతోంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ధనిక-పేద వర్గాల మధ్య అంతరాన్ని మరింత పెంచుతోంది. డిజిటల్ సౌకర్యాలు లేని వారు మరియు సాంకేతికతను అందుకోలేని వారు అభివృద్ధికి దూరమైపోతున్నారు. ఈ 'డిజిటల్ డివైడ్' ను తొలగించకపోతే సమాజంలో తీవ్రమైన అశాంతి నెలకొనే అవకాశం ఉంది. సాంకేతికత ద్వారా వచ్చే లాభాలు అందరికీ సమానంగా అందేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత. ఏఐ వల్ల కోల్పోతున్న ఉద్యోగాలకు ప్రత్యామ్నాయంగా సామాజిక భద్రతా పథకాలను ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. సాంకేతికత ఎప్పుడూ మానవుడికి సహాయకారిగానే ఉండాలి తప్ప, మనిషికి ప్రత్యామ్నాయంగా మారకూడదు. మనం ఏఐని ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగించుకోవాలే తప్ప, దానికి బానిసలు కాకూడదు. మానవ సంబంధాలు, సానుభూతి, నైతిక విలువలు వంటివి యంత్రాలకు ఉండవు, అవి కేవలం మనుషులకు మాత్రమే సొంతం. ఈ మానవీయ కోణాన్ని కాపాడుకుంటూనే సాంకేతిక పురోగతిని ఆహ్వానించాలి. ఏఐ విప్లవంలో మనిషి వెనుకబడిపోకుండా ఉండాలంటే, నిరంతర నైపుణ్యాభివృద్ధి మరియు విమర్శనాత్మక ఆలోచనా ధోరణిని పెంపొందించుకోవాలి. కొత్త మారుతున్న కాలానికి అనుగుణంగా మనల్ని మనం సిద్ధం చేసుకోవడమే ఏకైక మార్గం. ముగింపుగా చెప్పాలంటే, ఏఐ అనేది ఒక రెండంచుల కత్తి లాంటిది. దానిని సరైన పద్ధతిలో ఉపయోగిస్తే మానవజాతికి అద్భుతమైన వరం, లేదంటే అది ఒక వినాశకరమైన శాపంగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు మరియు సమాజం కలిసి ఏఐ వినియోగంపై ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేయాలి. సాంకేతికతకు మరియు మానవత్వానికి మధ్య ఒక సమతుల్యతను సాధించినప్పుడే ఈ ఏఐ విప్లవం నిజమైన అర్థంలో విజయవంతమవుతుంది. రాబోయే తరాలకు ఒక సురక్షితమైన మరియు అభివృద్ధి చెందిన ప్రపంచాన్ని అందించాలంటే, కృత్రిమ మేధస్సుపై మానవ మేధస్సు నియంత్రణను ఎప్పటికీ కోల్పోకూడదు.

# శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష అభిషేకం

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈ రోజు (23.03.2026) ఉదయం ఆలయప్రాంగణంలోని శ్రీసుబ్రహ్మణ్యస్వామి (కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి మంగళవారం మరియు కృత్తికానక్షత్రం, షష్ఠి తిథి రోజులలో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.కుమారస్వామివారికి పూజలు జరపడం వలన లోకకల్యాణమే కాకుండా ప్రతి ఒక్కరికి ఉద్యోగ, వ్యాపార, వ్యవహారాలలో ఆటుపోట్లు తొలగి ఆయా పనులు సక్రమంగా జరుగుతాయి. సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంతో శత్రుబాధలు, గ్రహపీడలు, దృష్టి దోషాలు మొదలైనవి తొలగిపోతాయి. అలాగే సంతానం కోసం పూజించేవారికి తప్పక సంతానభాగ్యం లభిస్తుందని చెప్పబడుతోంది. ఈ అభిషేకానికి ముందుగా దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతివైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, పాడి సమృద్ధిగా ఉండాలని, జనులకు ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, జనులందరూ సుఖశాంతులతో ఉండాలంటూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజ జరిపించబడింది. అనంతరం శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, అర్చన తరువాత సుబ్రహ్మణ్యస్తోత్ర పారాయణలు చేయబడ్డాయి. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలైన పాలు,పెరుగు,తేనె,నెయ్యి, కొబ్బరి నీళ్ళు మరియు వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ముఖ్యంగా వివిధ పండ్ల రసాలతో చేసే అభిషేకంతో ఎంతో ఫలితం ఉంటుందని ఆగమాలు చెబుతున్నాయి.



## శ్రీశైలం మల్లికార్జున స్వామిని భ్రమరాంబ దేవిని దర్శించుకున్న సినీ నటుడు శ్రీకాంత్ దంపతులు

మనగళం శ్రీశైలం : పుట్టినరోజు సందర్భంగా శ్రీశైలం భ్రమరాంబ, మల్లికార్జున స్వామివార్లను సినీ నటుడు శ్రీకాంత్, ఆయన సతీమణి ఊహా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనార్థమై ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వారికి అధికారులు, అర్చకులు ఆలయమర్యాదలతో ఆహ్వానం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అనంతరం శ్రీ బయలు వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఏపీఆర్వో డాక్టర్ శివారెడ్డి ఉన్నారు.




# ప్రముఖ లాయర్ ఏరువా వెంకటేశ్వర రెడ్డికి జిల్లాస్థాయి పదవి...

**- హర్షం వ్యక్తం చేసిన... మండల ప్రజలు**

మన గళం : పెద్దారవీడు మండలం మద్దెలకట్ట గ్రామానికి చెందిన యెరువ వెంకటేశ్వర రెడ్డి గారికి డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సెక్రటరీగా జిల్లా స్థాయి పదవి లభించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ స్థాయి నుంచి పార్టీకి నిబద్ధతతో సేవలు అందిస్తూ, క్రమంగా తన ప్రతిభను నిరూపించుకున్న ఆయనకు ఈ పదవి దక్కడం గర్వకారణంగా భావిస్తున్నారు. పార్టీ సిద్ధాంతాల పట్ల అంకితభావం, చట్టపరమైన అంశాలపై మంచి అవగాహన, ప్రజల సమస్యలపై స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతున్న వెంకటేశ్వర రెడ్డి గారు ఎప్పటికప్పుడు బాధితులకు అండగా నిలుస్తూ, న్యాయం సాధించేందుకు కృషి చేస్తున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయికి ఎదిగిన ఆయన ప్రయాణం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రజల సమస్యలను చట్టపరంగా పరిష్కరించడంలో ఆయన చూపుతున్న చురుకుదనం, నిబద్ధత పార్టీకి బలాన్ని చేకూరుస్తుందని నాయకులు భావిస్తున్నారు. మీ నాయకత్వంలో లీగల్ సెల్ మరింత శక్తివంతంగా మారి, పేదలు మరియు బలహీన వర్గాలకు న్యాయం అందించే దిశగా మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.






భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటూ... మీకు మరిన్ని విజయాలు, మంచి గుర్తింపు రావాలని మద్దెలకట్ట గ్రామస్తులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# కోడుమూరులో ఎమ్మార్పీఎస్ పోస్టర్ల విడుదల - కార్యకర్తల సమావేశం

మన గళం కోడుమూరు,: కోడుమూరు మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. కోడుమూరు మండల అధ్యక్షులు నాగేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కర్నూలు జిల్లా ఇన్చార్జ్ చిన్న మాదిగ, ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య, కె. రాజు హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జ్ చిన్న మాదిగ మాట్లాడుతూ కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం, వెల్దుర్తి మండలం, బుక్కాపురం గ్రామంలో ఈనెల 28వ తేదీ శనివారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నాగేష్ మాదిగ మాట్లాడుతూ.. కోడుమూరు మండల పరిధిలోని గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు సామాజిక వర్గ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మోష, గిడ్డయ్య, రమేష్, సురేష్, పరశురామ్, మోజేష్, వినోద్, తిప్పనూరు యోహాను, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారుం



## చర్మం, జుట్టుకు కొబ్బరి నూనె వరం


- సహజ సౌందర్యానికి ప్రాచీన పరిష్కారం
- తేమ, రక్షణ కలిగించే సహజ గుణాలు
- సరైన విధంగా వాడితే అద్భుత ఫలితాలు



డెస్క్, మార్చి 23 మన గళం, ఆరోగ్యం : సహజసిద్ధమైన పదార్థాలతో అందాన్ని కాపాడుకోవాలనే ధోరణి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కొబ్బరి నూనెకు ప్రత్యేక స్థానం ఉంది. పూర్వం నుంచి మన ఇళ్లలో ఉపయోగిస్తున్న ఈ నూనె చర్మం, జుట్టుకు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో ఉండే కొవ్వు ఆమ్లాలు, ముఖ్యంగా లారిక్ ఆమ్లం చర్మానికి తేమను అందించడమే కాకుండా రక్షణను కూడా కల్పిస్తుంది. చర్మ సంరక్షణలో కొబ్బరి నూనె ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇది చర్మానికి లోతుగా తేమను అందించి పొడిబారకుండా కాపాడుతుంది. మోకాళ్లు, మోచేతులు వంటి భాగాల్లో గట్టిపడిన చర్మాన్ని మృదువుగా మారుస్తుంది. అంతేకాకుండా ఇందులోని బ్యాక్టీరియా నిరోధక గుణాలు చిన్నపాటి చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. అయితే మొటిమలు ఎక్కువగా ఉన్న వారు ముఖంపై అధికంగా వాడటం మానుకోవడం మంచిది. జుట్టు సంరక్షణలో కూడా కొబ్బరి నూనె ఎంతో ప్రయోజనకరం. ఇది జుట్టు వేర్లకు పోషణనిచ్చి బలంగా పెరగడానికి సహాయపడుతుంది. తలస్నానం ముందు కొద్దిసేపు మర్దన చేస్తే జుట్టు నారుగా, మెరుస్తూ ఉంటుంది. అలాగే చుండ్రు సమస్యను తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. జుట్టు తెగిపోవడం, పొడిబారడం వంటి సమస్యలను తగ్గించడంలో ఇది మంచి పరిష్కారంగా నిలుస్తుంది. అయితే సరైన విధంగా వాడటం కూడా ముఖ్యమే. తక్కువ పరిమాణంలో ఉపయోగించడం మంచిది. చర్మం, జుట్టు స్వభావాన్ని బట్టి ఉపయోగించాలి. సహజసిద్ధమైన ఈ కొబ్బరి నూనెను సక్రమంగా వాడితే చర్మం, జుట్టు ఆరోగ్యంగా, అందంగా మారుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

## గుడ్లు ఆరోగ్యానికి అద్భుతమైన పోషకాహారం

- ప్రోటీన్ శక్తికి సహజ వనరు - శరీర వికాసానికి కీలక పాత్ర - సరైన మోతాదులో తీసుకుంటే మంచి ఫలితాలు



డెస్క్, మార్చి 23 మన గళం, ఆరోగ్యం : రోజువారీ ఆహారంలో గుడ్ల ప్రాముఖ్యత ఎంతో ప్రత్యేకం. సులభంగా లభించే ఈ ఆహార పదార్థం శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తుంది. ముఖ్యంగా ప్రోటీన్, విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండటం వల్ల పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గుడ్లు శక్తివంతమైన ప్రోటీన్ వనరుగా గుర్తింపు పొందాయి. శరీర కండరాల పెరుగుదల, కణాల పునరుద్ధరణలో ఇవి ముఖ్య పాత్ర పోషిస్తాయి. అలాగే గుడ్లలో ఉన్న విటమిన్ డీ, బి12, ఐరన్ వంటి పోషకాలు ఎముకల బలానికి, రక్తహీనత నివారణకు సహాయపడతాయి. రోజూ ఒకటి లేదా రెండు గుడ్లు తీసుకోవడం ఆరోగ్యానికి ఉపయోగకరమని నిపుణులు సూచిస్తున్నారు. మెదడు ఆరోగ్యానికి కూడా గుడ్లు ఎంతో మంచివి. ఇందులో ఉన్న కొలిన్ అనే పోషకం జ్ఞాపకశక్తిని పెంచడంలో సహాయపడుతుంది. అలాగే కళ్ల ఆరోగ్యాన్ని కాపాడే ల్యూటిన్, జియాక్సాంతిన్ వంటి పదార్థాలు కూడా గుడ్లలో లభిస్తాయి. అందువల్ల విద్యార్థులు, ఉద్యోగులు గుడ్లను ఆహారంలో భాగం చేసుకోవడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. అయితే గుడ్లను సరైన విధంగా వండుకుని తినడం అవసరం. అధికంగా వేయించిన లేదా నూనె ఎక్కువగా ఉపయోగించిన గుడ్లను తగ్గించడం మంచిది. సమతుల ఆహారంలో భాగంగా గుడ్లను తీసుకుంటే శరీరానికి పూర్తి స్థాయి పోషకాలు లభిస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

## ఎండాకాలంలో చెరుకు రసం శరీరానికి శక్తి నిచ్చే పానీయం

- తక్షణ శక్తి కోసం సహజ పరిష్కారం - డీహైడ్రేషన్‌కు చెక్ పెట్టే చల్లని పానీయం - పోషకాలతో నిండిన ఆరోగ్య రసం



డెస్క్, మార్చి 23 మన గళం, ఆరోగ్యం : వేసవికాలంలో పెరుగుతున్న ఎండ తీవ్రత కారణంగా శరీరం త్వరగా నీరసానికి గురవుతుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల చెమటలు ఎక్కువగా పట్టి, శరీరంలోని నీటి శాతం తగ్గిపోతుంది. ఈ పరిస్థితుల్లో సహజ పానీయాల ప్రాముఖ్యత మరింత పెరుగుతుంది. అందులో చెరుకు రసం ప్రత్యేక స్థానం సంపాదించింది. ఇది తక్షణ శక్తిని అందించడమే కాకుండా, శరీరాన్ని చల్లబరచే సహజ గుణాలు కలిగి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు చెరుకు రసం విస్తృతంగా వినియోగంలో ఉంది. చెరుకు రసంలో సహజ చక్కెరలు, ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పోషకాలను అందించి అలసటను తగ్గిస్తాయి. ముఖ్యంగా బయట ఎక్కువసేపు పని చేసే కార్మికులు, విద్యార్థులు, ప్రయాణికులకు ఇది తక్షణ శక్తి పానీయంగా ఉపయోగపడుతుంది. శరీరంలో గ్లూకోజ్ స్థాయిలను సమతుల్యం చేయడంలో చెరుకు రసం కీలక పాత్ర పోషిస్తుంది. డీహైడ్రేషన్ సమస్యలను నివారించడంలో చెరుకు రసం అత్యంత ప్రయోజనకరంగా ఉంటుంది. వేసవిలో శరీరం నుంచి నీరు త్వరగా కోల్పోతుండటంతో తలనొప్పి, తల తిరగడం, అలసట వంటి సమస్యలు వస్తాయి. ఈ సమయంలో చెరుకు రసం తీసుకోవడం ద్వారా శరీరంలో ద్రవాలు సమతుల్యం అవుతాయి. ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించి, లోపలి అవయవాలకు చల్లదనాన్ని అందిస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా చెరుకు రసం ఉపయోగకరంగా ఉంటుంది. ఇది కడుపులోని ఆమ్లతను తగ్గించి, అజీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. అలాగే కాలేయ పనితీరును మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. కొన్ని పరిశోధనలు చెరుకు రసం కాలేయాన్ని శుభ్రపరచడంలో సహకరిస్తుందని సూచిస్తున్నాయి. పసుపు జ్వరం వంటి సమస్యల సమయంలో కూడా ఇది ఉపశమనాన్ని కలిగించగలదని వైద్యులు చెబుతున్నారు. అయితే పరిశుభ్రత చాలా ముఖ్యం. రోడ్డుపక్కన లభించే చెరుకు రసం ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండకపోవచ్చు. కాబట్టి పరిశుభ్రమైన ప్రదేశాల్లో తయారుచేసిన రసమే తీసుకోవడం మంచిది. ఐస్, నీరు కలిపే విధానం కూడా పరిశీలించాలి. మితిమీరిన వినియోగం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగే ప్రమాదం ఉంటుంది. కాబట్టి రోజుకు ఒక గ్లాస్ లేదా అవసరాన్ని బట్టి మాత్రమే తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వేసవిలో సహజ పానీయాల వైపు మొగ్గుచూపడం ఆరోగ్యకరమైన అలవాటు. చెరుకు రసం వంటి సహజ పానీయాలు శరీరానికి శక్తిని, శీతలత్వాన్ని అందించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. సరైన మోతాదులో, పరిశుభ్రంగా తీసుకుంటే చెరుకు రసం వేసవికాలంలో ఉత్తమ సహచరంగా నిలుస్తుంది.

## మిరియాలు ఆరోగ్యానికి సహజ ఔషధం

- జీర్ణక్రియకు బలమైన మద్దతు - రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు
- సహజంగా శరీరాన్ని వేడిగా ఉంచే పదార్థం



డెస్క్, మార్చి 23 డెస్క్, మార్చి 23 మన గళం, ఆరోగ్యం : మన వంటింటిలో సాధారణంగా ఉపయోగించే మిరియాలు ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తాయి. చిన్న గింజలుగా కనిపించే ఈ మసాలా పదార్థం శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ప్రాచీన కాలం నుంచే మిరియాలను ఔషధంగా ఉపయోగిస్తున్నారు. మిరియాల్లో ఉండే పిపరిన్ అనే పదార్థం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఇది కడుపు సమస్యలను తగ్గించి ఆహారం సులభంగా జీర్ణం కావడానికి దోహదం చేస్తుంది. అలాగే మిరియాలు ఆకలిని పెంచి జీర్ణవ్యవస్థను చురుకుగా ఉంచుతాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా మిరియాలు కీలక పాత్ర పోషిస్తాయి. జలుబు, దగ్గు వంటి సమస్యల సమయంలో మిరియాల కషాయం తాగడం వల్ల ఉపశమనం లభిస్తుంది. ఇందులో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని రోగాల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. అయితే మిరియాలను మితంగా వాడటం అవసరం. అధికంగా తీసుకుంటే కడుపు మంట వంటి సమస్యలు రావచ్చు. సరైన మోతాదులో ఆహారంలో చేర్చుకుంటే మిరియాలు ఆరోగ్యానికి మంచి సహాయకంగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

## బేబీ సబ్బులు శిశువుల చర్మానికి మృదువైన సంరక్షణ




డెస్క్, మార్చి 23, మన గళం, ఆరోగ్యం : శిశువుల చర్మం ఎంతో సున్నితంగా ఉండటంతో వాటి సంరక్షణలో ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. ఈ నేపథ్యంలో బేబీ సబ్బులు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. సాధారణ సబ్బులతో పోలిస్తే బేబీ సబ్బులు తక్కువ రసాయనాలతో, మృదువైన పదార్థాలతో తయారు చేయబడతాయి. ఇవి శిశువుల చర్మాన్ని నాజూగ్గా కాపాడటంలో సహాయపడతాయి. బేబీ సబ్బుల్లో సాధారణంగా తక్కువ సువాసన ద్రవ్యాలు, హానికర రసాయనాలు ఉండవు. చర్మాన్ని పొడిబారకుండా తేమగా ఉంచే గుణాలు వీటిలో ఉంటాయి. శిశువుల చర్మంపై ఎలాంటి అలర్జీలు, ఇర్రిటేషన్ కలగకుండా ప్రత్యేకంగా రూపొందించబడటం వీటి ప్రధాన లక్షణం. అందువల్ల తల్లిదండ్రులు సబ్బు ఎంపికలో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శిశువులకు రోజూ స్నానం చేయించేటప్పుడు బేబీ సబ్బులను మితంగా ఉపయోగించడం మంచిది. ఎక్కువగా సబ్బు ఉపయోగించడం వల్ల చర్మంలోని సహజ తేమ తగ్గే అవకాశం ఉంది. అలాగే ప్రతి సారి కొత్త ఉత్పత్తిని వాడేముందు చిన్న భాగంలో పరీక్ష చేయడం ద్వారా అలర్జీ సమస్యలు నివారించవచ్చు. మార్కెట్లో అనేక రకాల బేబీ సబ్బులు లభిస్తున్నాయి. అయితే వాటి నాణ్యత, పదార్థాలను పరిశీలించి మాత్రమే కొనుగోలు చేయడం అవసరం. శిశువుల చర్మ ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని సురక్షితమైన, నమ్మకమైన ఉత్పత్తులను ఎంచుకోవడం తల్లిదండ్రుల బాధ్యతగా నిపుణులు సూచిస్తున్నారు.

## నారింజ పండ్లు ఆరోగ్యానికి సహజ రక్షకులు



డెస్క్, మార్చి 23 మన గళం, ఆరోగ్యం :: రోజువారీ ఆహారంలో నారింజ పండ్ల ప్రాముఖ్యత ఎంతో ప్రత్యేకం. రుచికరంగా ఉండే ఈ పండ్లు శరీరానికి అవసరమైన ముఖ్యమైన పోషకాలను అందిస్తాయి. ముఖ్యంగా విటమిన్ సి అధికంగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. నారింజల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి మెరుపు పెంచడంలో ఇవి ఉపయోగపడతాయి. అలాగే జలుబు, దగ్గు వంటి సమస్యలను తగ్గించడంలో కూడా నారింజలు సహకరిస్తాయని వైద్యులు చెబుతున్నారు. జీర్ణక్రియకు కూడా నారింజలు మేలు చేస్తాయి. ఇందులో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థను సక్రమంగా పని చేయడానికి సహాయపడుతుంది. అలాగే శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచి వేసవిలో అలసటను తగ్గించడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే మితంగా తీసుకోవడం అవసరం. అధికంగా తీసుకుంటే ఆమ్లత్వం సమస్యలు రావచ్చు. రోజువారీ ఆహారంలో సమతులంగా నారింజలను చేర్చుకుంటే ఆరోగ్యానికి మంచి ఫలితాలు ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

మంగళవారం
24 - 03 - 2026
మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# నెమలిలా పురివిప్పిన బ్యూటీ..



హైదరాబాద్, మార్చి 23,మన గళం : మృణాల్ ఠాకూర్ అందం, అభినయం కలగలిపిన అరుదైన నటి. ఆమె గురించి ఎంత చెప్పినా తక్కువే. తన సహజ నటనతో పాటు మెరిసే అందంతో ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఎప్పుడూ సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ బ్యూటీ తాజాగా పంచుకున్న ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

'సీతారామం' చిత్రంతో ఒక్కసారిగా స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన మృణాల్, అందులో సీత పాత్రలో తన మృదువైన నటనతో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. ఆ సినిమా విజయంతో ఆమె కెరీర్‌కు కొత్త మలుపు తిరిగింది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోల సరసన నటించే ఛాన్స్‌లు దక్కించుకుంది. అయితే, ఆ తరువాత వచ్చిన చిత్రాలు 'సీతారామం' స్థాయి విజయాన్ని అందుకోకపోయినా, మృణాల్‌కు అవకాశాలు మాత్రం తగ్గలేదు. తన టాలెంట్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో దర్శకుల దృష్టిని ఆకర్షిస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ అందాల తార పలు ఆసక్తికర ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కొత్త కథలు, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇక సోషల్ మీడియాలో షేర్ చేసిన తాజా ఫొటోల్లో ఆమె స్టైలిష్ లుక్, గ్రేస్ అభిమానులను మరింత ఆకట్టుకుంటున్నాయి మొత్తానికి, అందం మాత్రమే కాదు, నటనలోనూ తన ప్రత్యేకతను నిరూపించుకున్న మృణాల్ ఠాకూర్, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభిమానులు ఆశిస్తున్నారు.



# మార్చి చివరి వారంలో ఎంటర్‌టైన్‌మెంట్ జోష్..




హైదరాబాద్, మార్చి 23,మన గళం : చూస్తుండగానే మార్చి నెల చివరి వారం మొదలైంది. ఈ నెలలో ఇప్పటికే పెద్ద సినిమాలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా, ఇప్పుడు చిన్న సినిమాల సమయం వచ్చింది. కంటెంట్ ఆధారంగా ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నంలో యంగ్ హీరోలు, కొత్త కథలతో ముందుకొస్తున్నారు. ఈ వారం థియేటర్లలో విడుదలవుతున్న చిత్రాల్లో 'బ్యాండ్ మేళం' ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించిన ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో బావ-మరదళ్ల ప్రేమకథగా తెరకెక్కి మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే ప్రియదర్శి, ద్రిషిక చందర్ నటించిన సైకాలజికల్ థ్రిల్లర్ 'సుయోధన' మార్చి 27న విడుదలకు సిద్ధమైంది. హీరోకి మాత్రమే కనిపించే ప్రత్యేక శక్తి చుట్టూ తిరిగే ఈ కథ ఆసక్తిని రేకెత్తిస్తోంది. కామెడీ ఎంటర్‌టైనర్ అభిమానుల కోసం సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించిన 'గోట్' చిత్రం కూడా మార్చి 26న రిలీజ్ కానుంది. క్రికెట్ నేపథ్యంతో సరదాగా సాగే ఈ సినిమా వినోదాన్ని పంచనుంది. ఇదే సమయంలో తమిళంలో రూపొందిన 'యూత్' చిత్రం తెలుగు డబ్బింగ్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. స్కూల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ కథ యూత్‌ను ఆకట్టుకునేలా ఉంటుంది. ఇక సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'హ్యాపీ రాజ్' చిత్రం మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రంతో ఒకప్పుడు టాలీవుడ్‌లో గుర్తింపు పొందిన అబ్బాస్ మళ్లీ తెరపై కనిపించనుండటం విశేషం. ఇక ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఆసక్తికర కంటెంట్ అందుబాటులోకి రానుంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'బైట్' వెబ్ సిరీస్, 'ప్రెటీ లేథల్' సినిమా మార్చి 25న స్ట్రీమింగ్‌కు వస్తున్నాయి. నెట్‌ఫ్లిక్స్‌లో 'హార్ట్ బ్రేక్ హై' మూడో సీజన్, 'మర్దానీ 3' వంటి కంటెంట్ విడుదలవుతోంది. జియో హాట్‌స్టార్, జీ5, ఆహా, ఈటీవీ విన్ వంటి ప్లాట్‌ఫామ్‌ల్లో కూడా పలు సినిమాలు, వెబ్ సిరీస్‌లు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇటీవలి కాలంలో బాక్సాఫీస్ ట్రెండ్ మారిపోయింది. స్టార్ హీరోలు కాకపోయినా, మంచి కంటెంట్ ఉంటే సినిమాలు విజయవంతం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వారం విడుదలవుతున్న చిన్న సినిమాలు కూడా తమ కథ, కథనాలతో ప్రేక్షకుల మనసులు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మొత్తానికి, మార్చి చివరి వారంలో చిన్న సినిమాలే పెద్దగా ఎంటర్‌టైన్ చేయబోతున్నాయి.

# రెండో పెళ్లిపై క్లారిటీ ఇచ్చిన నిహారిక



హైదరాబాద్, మార్చి 23, మన గళం : మెగా కుటుంబానికి చెందిన కొణిదెల నిహారిక వ్యక్తిగత జీవితం ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంది. ముఖ్యంగా విడాకుల తర్వాత ఆమెపై మరింత ఫోకస్ పెరిగింది. చైతన్య జొన్నలగడ్డతో వివాహ బంధం ముగిసిన తర్వాత, నిహారిక ప్రస్తుతం తన కెరీర్‌పై పూర్తిగా దృష్టి పెట్టింది.నటిగా ప్రయాణం ప్రారంభించిన ఆమె, ఇప్పుడు నిర్మాతగా కొత్త అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆమె నిర్మించిన తొలి చిత్రం కమిటీ కుర్రోళ్లు మంచి విజయాన్ని అందుకోగా, ఇప్పుడు రాకాస అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధంగా ఉంది.ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మీడియాతో మాట్లాడిన నిహారికకు రెండో పెళ్లిపై ప్రశ్న ఎదురైంది. దీనిపై స్పందిస్తూతాను మళ్లీ పెళ్లి చేసుకునే ఆలోచన పూర్తిగా లేదని కాదు కానీ ప్రస్తుతం ఆ దిశగా ఆలోచించడం లేదని స్పష్టం చేసింది. జీవితంలో ఏం జరుగుతుందో సమయమే నిర్ణయిస్తుందని తెలిపింది.ఇక తన అన్నయ్య వరుణ్ తేజ్, వదిన లావణ్య త్రిపాఠి ప్రేమ కథ గురించి కూడా ఆసక్తికర విషయాలు వెల్లడించింది. వారి లవ్ స్టోరీ గురించి తాను నాలుగేళ్ల తర్వాతే తెలుసుకున్నానని, ముందే తెలిసిందనే వార్తలను ఖండించింది. వరుణ్‌కు ఇండస్ట్రీలో ఎక్కువ మంది స్నేహితులు లేకపోవడంతో ఈ విషయం చాలా కాలం రహస్యంగానే ఉందని చెప్పింది.వరుణ్ తేజ్ వ్యక్తిత్వంపై మాట్లాడుతూఅతను ఇంట్రోవర్ట్‌గా కనిపించినా, నిజానికి చాలా సరదాగా ఉండే వ్యక్తి అని తెలిపింది. కుటుంబంలో కూడా ఆటపట్టిస్తూ అందరినీ నవ్విస్తుంటాడని చెప్పింది.సోషల్ మీడియాలో ట్రోలింగ్‌పై కూడా నిహారిక ఘాటుగా స్పందించింది. ట్రోలింగ్‌ను కొందరు హక్కుగా భావిస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే మార్పు వస్తుందని పేర్కొంది.

# ముంబై స్లమ్స్‌లో 'రౌడీ జనార్ధన' హడావిడి

హైదరాబాద్, మార్చి 23,మన గళం : టాలీవుడ్ స్టార్ విజయ్ దేవరకొండ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆయన నటిస్తున్న సినిమాల్లో రౌడీ జనార్ధన ఒకటి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మిస్తుండగా, దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్నారు. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర వార్త సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ముంబై స్లమ్స్ నేపథ్యంలో తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాకే హైలైట్‌గా నిలవబోతుందట. రియలిస్టిక్‌గా, ఇంటెన్స్‌గా ఉండేలా ఈ ఫైట్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో మాస్ ఎంటర్‌టైనర్‌గా సినిమా రూపొందుతోంది. ఇప్పటికే విజయ్ దేవరకొండ లుక్, ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇక 'రౌడీ' అనే ట్యాగ్‌తో ఇప్పటికే అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన విజయ్, ఇప్పుడు అదే ఇమేజ్‌కు సరిపోయే టైటిల్‌తో వస్తుండటంతో ఫ్యాన్స్‌లో ఉత్సాహం మరింత పెరిగింది. ఈ సినిమాతో విజయ్ తన మాస్ అవతార్‌ను మరో స్థాయికి తీసుకెళ్తాడని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# క్రికెట్‌లో హ్యాట్రిక్ అంటే ఏంటి? ఆ పేరు ఎలా వచ్చింది?



లండన్, మార్చి ,23 మన గళం : క్రికెట్‌లో బౌలర్ వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు పడగొడితే దాన్ని 'హ్యాట్రిక్' అని అంటారు. ఇది బౌలర్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఘనతగా భావిస్తారు. కానీ ఈ పదం ఎలా వచ్చింది? ఎందుకు "హ్యాట్" అనే పదం దీనితో కలిసింది? అనే ప్రశ్నలకు సమాధానం 19వ శతాబ్దం ఇంగ్లాండ్‌లో దాగి ఉంది. 1858లో ఇంగ్లాండ్‌లో జరిగిన ఒక మ్యాచ్‌లో హీత్‌ఫీల్డ్ హార్మన్ స్టీఫెన్సన్ అనే బౌలర్ వరుసగా మూడు బంతుల్లో మూడు వికెట్లు తీసి అరుదైన ఘనత సాధించాడు. ఆ కాలంలో ఇది చాలా పెద్ద విషయం. అతని ప్రదర్శనకు మంత్రముగ్ధులైన అభిమానులు, ఆటగాళ్లు కలిసి అతనిని ప్రత్యేకంగా సత్కరించాలని నిర్ణయించారు. అందుకోసం ప్రేక్షకులు చందాలు పోగుచేసి ఒక టోపీ (హ్యాట్) కొనుగోలు చేసి అతనికి బహుమతిగా ఇచ్చారు. అలా వరుసగా మూడు వికెట్లు తీసిన బౌలర్‌కు "హ్యాట్" ఇవ్వడం ఒక సంప్రదాయంగా మారింది. మూడు వికెట్లు తీయడం ఒక గొప్ప ట్రిక్ అని భావించి, "హ్యాట్" + "ట్రిక్" కలిపి "హ్యాట్రిక్" అనే పదం ఏర్పడింది. తర్వాత కాలంలో ఈ పదం మరింత ప్రాచుర్యం పొందింది. 1878-79లో ఫ్రెడ్ స్పాఫోర్త్ టెస్ట్ క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించినప్పుడు పత్రికలు ఈ పదాన్ని అధికారికంగా ఉపయోగించాయి. అప్పటి నుంచి క్రికెట్‌లో ఇది స్థిరపడి, ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. ప్రస్తుతం హ్యాట్రిక్ అనేది కేవలం క్రికెట్‌కే పరిమితం కాదు. ఫుట్‌బాల్, హాకీ వంటి ఇతర క్రీడల్లో కూడా వరుసగా మూడు గోల్స్ లేదా విజయాలు సాధించినప్పుడు "హ్యాట్రిక్" అని పిలుస్తున్నారు. అయితే దీని అసలు మూలం మాత్రం క్రికెట్ మైదానంలోనే ఉంది. ఆధునిక క్రికెట్‌లో, ముఖ్యంగా తక్కువ ఓవర్ల ఫార్మాట్లలో హ్యాట్రిక్ సాధించడం చాలా కష్టమైన విషయం. బ్యాటర్లు దూకుడుగా ఆడుతున్న సమయంలో వరుసగా మూడు వికెట్లు తీయడం బౌలర్ ప్రతిభకు నిదర్శనం. అందుకే హ్యాట్రిక్ ఇప్పటికీ క్రికెట్‌లో ఒక ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచింది.

# 60 ఏళ్ల వరకు ఆడుతా.. రిటైర్మెంట్‌పై ధోనీ సరదా కామెంట్స్!




చెన్నై, మార్చి 23 మన గళం : ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు మహేంద్ర సింగ్ ధోనీ ఊహించని జోష్ ఇచ్చాడు. తన రిటైర్మెంట్‌పై వస్తున్న వార్తలకు తనదైన శైలిలో స్పందిస్తూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. చెన్నైలో జరిగిన జట్టు అభిమానుల కార్యక్రమంలో పాల్గొన్న ధోనీ.. రిటైర్మెంట్ గురించి మాట్లాడాడు. ఈ సందర్భంగా తమిళ నటుడు శివకార్తికేయన్ ధోనీని మరికొన్ని సంవత్సరాలు ఆట కొనసాగించాలని కోరాడు. దీనికి నవ్వుతూ స్పందించిన ధోనీ.. "ప్రస్తుతం నా వయసు 44. ఫిట్‌నెస్‌ను నిలబెట్టుకోవడం సవాలే. కానీ మీరు ఆందోళన పడొద్దు.. నేను 60 ఏళ్ల వరకు ఆడినా ఆశ్చర్యపోవద్దు" అంటూ సరదాగా వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యలు అభిమానుల్లో ఉత్సాహాన్ని రేకెత్తించాయి. ఇప్పటికే ఈ సీజన్ మొత్తం ధోనీ అందుబాటులో ఉంటాడని జట్టు వర్గాలు స్పష్టం చేశాయి. అయితే గత కొన్ని సీజన్లుగా ఆయన పాత్రలో మార్పులు కనిపిస్తున్నాయి. కెప్టెన్సీ బాధ్యతలను యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించిన ధోనీ, ఇప్పుడు ప్రధానంగా ఫినిషర్ పాత్రలో కొనసాగుతున్నాడు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనలతో పాటు జట్టులో కొత్త ఆటగాళ్లు చేరుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా పంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ ధోనీ ఉనికి మాత్రమే జట్టుకు పెద్ద బలం అని అభిమానులు భావిస్తున్నారు. మొత్తానికి రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలకు ధోనీ తన స్టైల్లోనే సరదా కౌంటర్ ఇచ్చాడు.

# స్టేడియానికి వెళ్లక్కర్లేదు.. టికెట్ అక్కర్లేదు..




న్యూఢిల్లీ, మార్చి 23 ,మన గళం : దేశవ్యాప్తంగా క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ 2026 సందడి మొదలైంది. స్టేడియానికి వెళ్లి మ్యాచ్ చూడలేని అభిమానుల కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి భారీ ఏర్పాట్లు చేసింది. టికెట్ లేకుండానే స్టేడియంలో మ్యాచ్ చూస్తున్న అనుభూతిని అందించేందుకు ఫ్యాన్ పార్కుల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాల్లోని 15 నగరాల్లో ఈ ఫ్యాన్ పార్కులను ఏర్పాటు చేస్తున్నారు. మూడు వేర్వేరు వారాంతాల్లో (శని, ఆదివారాలు) ఈ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ప్రతి వారంలో ఐదు నగరాల్లో అభిమానులకు ఈ ప్రత్యేక అనుభవం అందుబాటులో ఉంటుంది. మొదటి వారం మార్చి 28, 29 తేదీల్లో రోహ్‌తక్, భోపాల్, నాగ్‌పూర్, తుమకూరు, కృష్ణానగర్ నగరాల్లో ఫ్యాన్ పార్కులు నిర్వహించనున్నారు. రెండో వారం ఏప్రిల్ 4, 5 తేదీల్లో మధుర, జోధ్‌పూర్, నిజామాబాద్, మైసూరు, భువనేశ్వర్ నగరాల్లో ఏర్పాట్లు ఉంటాయి. మూడో వారం ఏప్రిల్ 11, 12 తేదీల్లో మీరట్, నడియాడ్, రత్నగిరి, కోయంబత్తూరు, రూర్కెలా నగరాల్లో అభిమానులకు ఐపీఎల్ జోష్ అందించనున్నారు. ఫ్యాన్ పార్కులు కేవలం మ్యాచ్ చూసే ప్రదేశాలు మాత్రమే కాకుండా చిన్న పండుగలా ఉంటాయి. భారీ తెరలపై ప్రత్యక్ష ప్రసారం, సంగీత కార్యక్రమాలు, వినోదం, ఆహార కేంద్రాలు, చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు వంటి అనేక సౌకర్యాలు ఉంటాయి. అదనంగా వర్చువల్ బ్యాటింగ్, బౌలింగ్ అనుభవాలు, ఫేస్ పెయింటింగ్, 360 డిగ్రీల ఫోటో బూత్‌లు అభిమానులకు కొత్త అనుభూతిని ఇస్తాయి. 2015లో ప్రారంభమైన ఈ ఫ్యాన్ పార్క్ కాన్సెప్ట్, స్టేడియాలకు దూరంగా ఉన్న నగరాల్లో కూడా ఐపీఎల్ ఉత్సాహాన్ని తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా తెలంగాణలోని నిజామాబాద్ అభిమానులకు రెండో వారంలో ఈ అవకాశం దక్కడం ప్రత్యేకంగా మారింది. ఈసారి మరింత ఆధునిక సదుపాయాలతో ఫ్యాన్స్‌కు మరపురాని అనుభూతిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# దేశవ్యాప్తంగా ఫ్యాన్ పార్కులు.. ఐపీఎల్ జోష్‌కు కొత్త రంగు!



న్యూఢిల్లీ, మార్చి 23 ,మన గళం : క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2026 సీజన్ ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైంది. మార్చి 28నసన్‌రైజర్స్ హైదరాబాద్ మరియు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుండగా, స్టేడియానికి వెళ్లలేని అభిమానుల కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి దేశవ్యాప్తంగా ప్రత్యేకంగా 'ఫ్యాన్ పార్కులు' ఏర్పాటు చేస్తోంది. ఈ ఫ్యాన్ పార్కుల ప్రధాన ఉద్దేశ్యం ప్రేక్షకులకు స్టేడియంలో మ్యాచ్ చూస్తున్న అనుభూతిని కలిగించడం. భారీ తెరలపై ప్రత్యక్ష ప్రసారం, సంగీత కార్యక్రమాలు, ఆహార స్టాళ్లు, చిన్నారుల కోసం ఆట స్థలాలు వంటి అనేక వినోద కార్యక్రమాలు ఇందులో ఉంటాయి. అదనంగా వర్చువల్ బ్యాటింగ్, బౌలింగ్ అనుభవాలు, ఫేస్ పెయింటింగ్ వంటి వినోదాలు అభిమానులను ఆకట్టుకోనున్నాయి. మూడు వారాల పాటు ప్రతి శని, ఆదివారాల్లో దేశంలోని ఐదు నగరాల్లో ఈ ఫ్యాన్ పార్కులు నిర్వహించనున్నారు. మొదటి వారంలో రోహ్తక్, భోపాల్, నాగ్‌పూర్, తుమకూరు, కృష్ణా నగర్ నగరాల్లో ప్రారంభం కానుండగా, రెండో వారంలో మధుర, జోధ్‌పూర్, మైసూరు, భువనేశ్వర్, నిజామాబాద్ నగరాల్లో కొనసాగుతాయి. మూడో వారంలో మీరట్, నడియాద్, రత్నగిరి, కోయంబత్తూర్, రూర్కెలా నగరాల్లో అభిమానులకు ఈ అనుభవం లభించనుంది. ప్రత్యేకంగా తెలంగాణలోని నిజామాబాద్ అభిమానులకు రెండో వారంలో ఈ అవకాశం దక్కనుంది. ఇప్పటికే 2015లో ప్రారంభమైన ఈ ఫ్యాన్ పార్క్ కాన్సెప్ట్, ఐపీఎల్ ఉత్సాహాన్ని ప్రతి ప్రాంతానికి చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈసారి మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, అభిమానులకు మరపురాని అనుభూతిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# న్యూజిలాండ్ క్రికెట్ బోర్డుకు షాక్.. కీలక సభ్యుడి రాజీనామా!



వెల్లింగ్టన్, మార్చి 23 ,మన గళం : ఐ సి సి టి20 ప్రపంచ కప్ 2026 ఫైనల్లో భారత జట్టుతో జరిగిన ఓటమి తర్వాత న్యూజిలాండ్ క్రికెట్‌లో అంతర్గత కలహాలు బయటపడుతున్నాయి. తాజాగా న్యూజిలాండ్ క్రికెట్ బోర్డుకు చెందిన కీలక సభ్యుడు, మాజీ క్రికెటర్ డైన్ వాస్ తన పదవికి రాజీనామా చేయడం కలకలం రేపింది. భారత్ చేతిలో భారీ తేడాతో ఓటమి చెందిన తర్వాత జట్టుపై, బోర్డు నిర్ణయాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో బోర్డు తీసుకున్న కొన్ని కీలక నిర్ణయాలపై విభేదాలు తలెత్తినట్లు సమాచారం. ముఖ్యంగా కొత్త ఫ్రాంచైజీ ఆధారిత టీ20 లీగ్ ప్రారంభించే నిర్ణయం, అలాగే ఆస్ట్రేలియా లీగ్‌లో న్యూజిలాండ్ జట్టును చేర్చే ప్రతిపాదనపై సభ్యుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ వివాదాల నడుమ డైన్ వాస్ తన పదవికి రాజీనామా చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నాడు. బోర్డు తీసుకున్న నిర్ణయాలకు తాను మద్దతు ఇవ్వలేనని, అందుకే ఈ సమయంలో తప్పుకోవడం సమంజసమని పేర్కొన్నాడు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే ఆయన రాజీనామా చేయడం కివీస్ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇదే అంశంపై గతంలోనూ విభేదాలు నెలకొన్నాయి. గత ఏడాది కూడా బోర్డు విధానాలపై అసంతృప్తితో ముఖ్య కార్యనిర్వాహణ అధికారి స్కాట్ వీనింక్ తన పదవిని వీడిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరో కీలక సభ్యుడు తప్పుకోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చింది. ఇతర పెద్ద దేశాలతో పోలిస్తే అంతర్జాతీయ క్రికెట్ మండలి నుంచి న్యూజిలాండ్‌కు వచ్చే ఆదాయం తక్కువగా ఉండటం వల్లే కొత్త లీగ్ ఆలోచనకు శ్రీకారం చుట్టినట్లు క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ నిర్ణయం బోర్డులో విభేదాలకు దారితీయడంతో భవిష్యత్తులో మరిన్ని పరిణామాలు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# ధోనీ కీపింగ్ మ్యాజిక్.. మురళీధరన్ - శాంసన్ సన్నివేశం వైరల్!



చెన్నై, మార్చి 23 ,మన గళం : ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ప్రారంభానికి ముందు అభిమానుల్లో ఉత్సాహం పెంచేలా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ప్రత్యేక ఫ్యాన్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆటగాళ్లు పాల్గొని ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా మహేంద్ర సింగ్ ధోనీ కీపింగ్, ముత్తయ్య మురళీధరన్ బౌలింగ్, సంజూ శాంసన్ బ్యాటింగ్ మధ్య జరిగిన సన్నివేశం హైలైట్‌గా నిలిచింది. ఈ ఈవెంట్‌లో మురళీధరన్ వేసిన బంతులను ఎదుర్కొన్న శాంసన్ తొలి రెండు బంతులను జాగ్రత్తగా డిఫెన్స్ ఆడాడు. ఆ తర్వాత భారీ షాట్ కొట్టేందుకు ముందుకు వచ్చి ప్రయత్నించాడు. అయితే బంతిని పూర్తిగా మిస్ అయ్యాడు. ఆ సమయంలో వికెట్ కీపర్‌గా ఉన్న ధోనీ బంతిని చాకచక్యంగా అందుకుని స్టంపింగ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ, కావాలనే స్టంప్స్‌ను తాకకుండా వదిలేశాడు. ఈ స్మార్ట్ మూవ్ చూసిన ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. తదుపరి బంతికీ శాంసన్ కనెక్ట్ కాలేకపోయాడు. కానీ చివరి బంతికి మాత్రం అద్భుతంగా స్పందించి భారీ సిక్సర్ బాదాడు. బంతి నేరుగా స్టాండ్స్‌లోకి వెళ్లిపోవడంతో చెపాక్ మైదానం మొత్తం కేరింతలతో మార్మోగింది. ఈ సరదా ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP.
Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.